RNI No.TELTEL/2016/68720

ప్రజలకోసం పోలీస్

# పోలీస్ నిఘా
POLICE NIGAH
తెలుగు దినపత్రిక

Published from Rangareddy, (Circulated) by Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Sangareddy, Vikarabad, Medak, Siddipet, Karimnagar, Sirisilla(Vemulawada), Nizamabad, Warangal, Yadadri Bhonagiri, Nirmal, Adilabad

రంగారెడ్డి | సంపుటి : 10 సంచిక : 169 | ఎడిటర్: కేమోజు శ్రీనివాస్ | ఆదివారం 22-03-2026 | వెల: రూ.5/- పేజీలు: 8

పోలీస్ నిఘా POLICE NIGAH తెలుగు దిన & మాస పత్రిక
పోలీస్ నిఘా POLICE NIGAH Web NEWS TV
రెండు తెలుగు రాష్ట్రాల్లో రిపోర్టర్స్ కావలెను
Contact : 9133613813

రిపోర్టర్లు కావలెను
పోలీస్ నిఘా POLICE NIGAH NEWS TV
TG-AP తెలంగాణ - ఆంధ్రప్రదేశ్
● మండలాల వారీగా కావలెను
● ఎలాంటి టార్గెట్స్ ఉండవు
● సీనియర్లకు ప్రాధాన్యం
● కొత్తవారికి అవకాశం
● లోగో, ఐ.డి. కార్డు, ట్యాగ్
● వెహికల్ స్టిక్కర్ ఇవ్వబడును.
9133613813, 9642614994
@PoliceNigahNewsTv

## ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌కు ప్రధాని మోదీ ఫోన్



న్యూఢిల్లీ, మార్చి 21 : పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా రంజాన్, నౌరుజ్ (పర్షియన్ నూతన సంవత్సరం) శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన.. ఈ పర్వదినాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం తీసుకువస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు, ప్రపంచ సరఫరా గొలుసుకు ఆటంకం కలిగించే కీలక మౌలిక సదుపాయాలపై దాడులను ప్రధాని మోదీ ఖండించారు. నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగాలని.. నౌకామార్గాలు తెరచి ఉంచడం, వాటిని సురక్షితంగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇరాన్‌లోని భారతీయుల రక్షణకు ఆ దేశం తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ ప్రశంసించారు. యుద్ధం మొదలైన తర్వాత ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడటం ఇది రెండోసారి. మార్చి 12న ఓసారి ఫోన్‌లో సంభాషించిన ప్రధాని.. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్చలు, దౌత్యమార్గాల్లోనే సంక్షోభాలను పరిష్కరించుకోవాలని ఇరాన్ అధ్యక్షుడికి సూచించారు. అనంతరం సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఖతార్, కువైట్, జోర్డాన్, మలేసియా, ఫ్రాన్స్ అధినేతలతో ఫోన్‌లో మాట్లాడిన మోదీ.. పశ్చిమాసియాలో తాజా పరిస్థితులపై చర్చించారు.

## ఏప్రిల్ రెండో వారంలో తెలంగాణకు మోదీ



హైదరాబాద్, మార్చి 21 (పోలీస్ నిఘా) : ఏప్రిల్ రెండో వారంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ నెలాఖరున మోదీ పర్యటన తేదీ ఖరారయ్యే అవకాశం ఉంది.

# యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం: ట్రంప్



వాషింగ్టన్, మార్చి 21 : పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆయిల్, గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణా ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో యుద్ధం ఆగాలని ప్రపంచం అంతా కోరుకుంటోంది. ఈ క్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై తమ లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. తమ సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారు చేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం అని అందులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించ డానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈమేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

## వచ్చే వారం దాడులు మరింత తీవ్రతరం: ఇజ్రాయెల్ మంత్రి



ఇజ్రాయెల, మార్చి 21 : పశ్చిమాసియాలో యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దాడుల తీవ్రత రానున్న వారం మరింత పెరగనుందని చెప్పారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే కట్జ్ ఈమేరకు వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "ఇరాన్ పై దాడులు మరింత ముమ్మరం కానున్నాయి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు.. ఆ దేశ పాలనా యంత్రాంగం, కమాండర్లు, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటాం. యుద్ధ లక్ష్యాలన్నీ సాధించే వరకు విశ్రమించేది లేదు" అని సైనిక అధికారులతో సమీక్ష సందర్భంగా కట్జ్ అన్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇరాన్ నుంచి అణుముప్పును తొలగించడం, దాని సైనిక సామర్థ్యాలను దెబ్బతీయడం, ఆ దేశ ప్రజలకు స్వేచ్ఛ కల్పించడమే తమ లక్ష్యాలని అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్న విషయం తెలిసిందే.

## హర్మూజ్‌ను తెరవండి..!

### ఇరాన్‌కు 22 దేశాల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 21 : హర్మూజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి చేశాయి. దాడులు కూడా ఆపాలని కోరాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై దాడులను ఖండించాయి. ఇరాన్ చర్యల వల్ల అన్ని దేశాలపై దుష్ప్రభావం పడుతోందని పేర్కొన్నాయి. ఈమేరకు యూఏఈ, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, డెన్మార్క్, బహ్రెయిన్ తదితర దేశాలు సంయుక్త ప్రకటన చేశాయి. "గల్ఫ్‌లోని నిరాయుధ వాణిజ్య నౌకలు, చమురు, గ్యాస్ కేంద్రాలు సహా పౌర మౌలిక సదుపాయాలపై ఇటీవల ఇరాన్ జరిపిన దాడులు, హర్మూజ్ జలసంధిని మూసివేయడాన్ని ఖండిస్తున్నాం. సముద్ర చట్టాలకు సంబంధించి ఐరాస ఒప్పందంతో పాటు స్వేచ్ఛాయుత నౌకాయానం అనేది అంతర్జాతీయ చట్టంలో ఓ ప్రాథమిక సూత్రం. ఇరాన్ చర్యలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై, ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలపై ప్రభావం పడుతోంది" అని యూఏఈ విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేసింది.

# ఆధునిక యుద్ధం..సరిహద్దులు దాటింది

### కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్




ఉత్తరాఖండ్, మార్చి 21 : నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం యుద్ధం సరిహద్దులను దాటిందని.. ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయని అన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు అన్ని వేళలా దేశ రక్షణ కోసం సన్నద్ధమై ఉండాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే సాయుధ దళాలకు అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశ రక్షణలో యువత కూడా తమ వంతు పాత్ర పోషించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలన్నారు. సైన్యం, పౌరులు బలంగా ఉన్నప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు.

**ఎన్‌సీసీలో ప్రవేశాల సామర్థ్యం పెంపు**

దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రజా-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో దేశ వ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**'నారీ శక్తి'కి ఊతం**

సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతుండడాన్ని చరిత్రాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ నిర్ణయం దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. బాలికా క్యాడెట్లు తమ సామర్థ్యాలను నిరంతరం నిరూపించుకుంటున్నారని, వివిధ రంగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్షించారు.

# మీరాలం ఈద్గా వద్ద ఘనంగా రంజాన్ వేడుకలు

### భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన సీపీ సజ్జనార్





హైదరాబాద్, మార్చి 21 (పోలీస్ నిఘా) : ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద ముస్లింలు భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ప్రార్థనల అనంతరం ఆయన చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులందరూ సుఖసంతోషాలతో, ప్రశాంతంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. రంజాన్ మాసమంతా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగియడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల షాపింగ్ అవసరాలకు, ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశామని, అందరి సహకారంతో వేడుకలు విజయవంతంగా సాగాయని వివరించారు. పండుగ ఏర్పాట్లలో సహకరించిన మత పెద్దలకు, ఇతర ప్రభుత్వ విభాగాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ తఫ్సీర్ ఇక్బాల్, ఐపిఎస్ (అడిషనల్ సిపి – సౌత్ రేంజ్), శ్రీ.డి.జోయల్ డెవిస్ ఐపిఎస్ జాయింట్ సిపి ట్రాఫిక్, శ్రీమతి ఎన్. స్వేతా, ఐపిఎస్ (జాయింట్ సిపి – నార్త్ రేంజ్), శ్రీ.ఆర్.వెంకటేశ్వర్లు ఐపిఎస్ డిసిపి సిఎఆర్ హెడ్ క్వార్టర్స్,ఎస్. శ్రీనివాస్, ఐపిఎస్ (డిసిపి – రాజేంద్ర నగర్ జోన్), శ్రీ అవినాశ్ కుమార్ ఐపిఎస్ డిసిపి ట్రాఫిక్ తదితర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 21 (పోలీస్ నిఘా) : ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వ్యాఖ్యానించారు. ఈ విషయంలో అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌ను కలుస్తామని తెలిపారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల బిల్లుకు మద్దతు కోసం అన్నిపార్టీలకు లేఖలు రాస్తామని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఏపీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన చరిత్ర అసెంబ్లీకి ఉందని ప్రస్తావించారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. బీజేపీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును బీజేపీ వ్యతిరేకించినా ఇబ్బంది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం కోటి మోసాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రజల నుంచి ఓట్లు రాబట్టడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల హామీల అమలు చట్టం ఫైల్‌పై సంతకం చేశారని ఉభయ సభల్లో గత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన ప్రసంగంలో చెప్పారని ప్రస్తావించారు.

**కాంగ్రెస్ హామీలు పెద్ద ఫ్రాడ్..**

840 రోజులు అయినా ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయట్లేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పెద్ద ఫ్రాడ్ అని ఎద్దేవా చేశారు. సీఎం సంతకం చేసిన ఫైల్ ఎందుకు దొరకడం లేదని నిలదీశారు. ఈ ఫైల్ ఢిల్లీ విమాన ప్రయాణంలో పోయిందా..?, ఎఫ్ఎస్ఎల్ అగ్ని ప్రమాదంలో కాలిపోయిందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ సర్కార్ ఇంకా ఒక బడ్జెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి ఉందని.. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం కలుగుతుందని చెప్పుకొచ్చారు. ప్రజల తరపున ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడుతున్నామని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

### రాష్ట్రాలకు ఎల్పీజీ కేటాయింపు పెంపు : కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 21 :వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టిన కేంద్రం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీలో అదనంగా 20 శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. తాజా చర్యతో సంక్షోభ కాలానికి ముందున్న కేటాయింపుల్లో 50శాతానికి చేరినట్లయ్యిందని పేర్కొంది. అయితే, వీటిలో హోటళ్లు, రెస్టరంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీల్లో ఆహారం అందించే కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. చమురు కంపెనీల వద్ద రిజిస్టరైన వాణిజ్య సంస్థలతో పాటు పీఎన్‌జీ (పైపు ద్వారా గ్యాస్ పంపిణీ) కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికే ఈ అదనపు కేటాయింపు వర్తిస్తుందని కేంద్రం పేర్కొంది. మార్చి 23 నుంచి నుంచి ఈ అదనపు కేటాయింపులు సరఫరా చేస్తామని తెలిపింది.

## నా నిర్ణయంలో మార్పు లేదు..: జీవన్‌రెడ్డి



జగిత్యాల, మార్చి 21 (పోలీస్ నిఘా) : పార్టీ మారతానన్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం భేటీ అయ్యారు. గంటకుపైగా సమావేశమయ్యారు. పార్టీలో గౌరవం దక్కడం లేదని ఈ సందర్భంగా మంత్రుల ముందు జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భేటీ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మా ట్లాడారు. జీవన్‌రెడ్డి 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని అన్నారు. ఆయనతో అనేక అంశాలు చర్చించినట్లు తెలిపారు. ఆయన ఆవేదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదన్నారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని చెప్పారు.

## ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం




రాష్ట్రపతి నాటిన మొక్క వద్ద నరేష్

హైదరాబాద్, మార్చి 21 (పోలీస్ నిఘా) : దిల్లీలో ఉన్న వాయు కాలుష్యం, రాజస్థాన్ లో నీటి కొరత సమస్యలతో అక్కడి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మన తెలుగు రాష్ట్రాల్లో తక్కువ కాలుష్యం, ఎక్కువ నీటి వనరులతో జీవిస్తున్నామని పర్యావరణ పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు జి నరేష్ అన్నారు. ఈ మేరకు శనివారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అడవులు, మొక్కలు లేని జీవితం మనం ఊహించుకోలేమని, ఐక్యరాజ్యసమితి తెలిపిన లెక్కల ప్రకారం ఈ సంవత్సరం థీమ్ అడవులు ఆర్థిక వ్యవస్థలు అంటే అడవులు కేవలం పర్యావరణం మాత్రమే కాదు, మన ఆర్థిక వ్యవస్థకు ఇంజన్ లాంటివని ఆయన తెలిపారు.

## నేడు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### -లబ్ధిదారులకు ఆహ్వానం-



యాదగిరిగుట్ట, మార్చి 21 (పోలీస్ నిఘా): పట్టణంలో రేపు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రభుత్వ విప్ కార్యాలయంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొని, ఆలేరు నియోజకవర్గానికి చెందిన ఎనిమిది మండలాల లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా అధికారులు లబ్ధిదారులను కార్యక్రమానికి హాజరై చెక్కులను స్వీకరించుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారు తప్పనిసరిగా ఏదైనా చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది.

## యాదగిరిగుట్ట కొండ పైన బస్సు ప్రమాదం

### భక్తురాలికి తీవ్ర గాయాలు.. భద్రతపై ప్రశ్నలు



యాదగిరిగుట్ట, మార్చి 21 (పోలీస్ నిఘా) : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదం భక్తులను కలవరపరిచింది. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణం అవుతున్న ఓ యువతి బస్సు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడింది. నార్సింగ్ ప్రాంతానికి చెందిన అనిత (25) తన కుటుంబ సభ్యులతో కలిసి నిన్న సాయంత్రం ఆలయానికి వచ్చి, ఈ ఉదయం స్వామివారిని దర్శించుకుంది. అనంతరం కొండపై ఉన్న బస్టాండ్ వద్ద బస్సు ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా, డ్రైవర్ బస్సును ముందుకు కదిలించడంతో ఆమె సమతుల్యం కోల్పోయి జారి పడింది. ఈ క్రమంలో బస్సు వెనుక చక్రం ఆమె కాలు మీద వెళ్లడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనను గమనించిన స్థానికులు, ఇతర భక్తులు వెంటనే స్పందించి గాయపడిన అనితను అత్యవసరంగా భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రి కి రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో యాదగిరిగుట్ట కొండపై ఉన్న బస్టాండ్ వద్ద భద్రతా లోపాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బస్సులు ఆగే ప్రాంతంలో సరైన నియంత్రణ లేకపోవడం, ప్రయాణికులు ఎక్కే-దిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వేల సంఖ్యలో భక్తులు వచ్చే ఈ పవిత్రక్షేత్రంలో రవాణా నిర్వహణను కట్టుదిట్టం చేయాలని, బస్టాండ్ ప్రాంతంలో సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది, స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

## చింతపల్లిలో నిరాహార దీక్ష కరపత్రాల ఆవిష్కరణ



దేవరకొండ , మార్చి 21 (పోలీస్ నిఘా) : ఎస్సీ సంక్షేమ పథకాల సాధనకై మార్చి 30న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగ దండోరా నిరాహార దీక్ష కర పత్రాలను శనివారం చింతపల్లి మండలం అంబేద్కర్ చౌరస్తా లో ఆవిష్కరించారు మండల అధ్యక్షుడు సందే ఏసు మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు రాంజీ సైదులు మాదిగ జిల్లా నాయకులు కొండేటి మధు రాష్ట్ర నాయకులు ఎర్ర జగన్ మాదిగ రామకృష్ణ కంబాలపల్లి రామకృష్ణ సంధ్య ముత్తయ్య పేర్ల చిన్న మల్లయ్య శంకర్ కంబాలపల్లి గిరి తదితరులు పాల్గొని హక్కుల సాధన కోసం మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

## స్థానికులను ప్రాణాపాయ స్థితిలోకి నెట్టిన..

# రాంపూర్ డంపింగ్ యార్డు

ఎన్ని నిరసనలు ఉద్యమాలు చేసిన
పట్టింపులేని పాలకులు...
ఎన్నికలప్పుడే వాగ్దానాలు

గ్రామం విడిచి వెళుతున్న యువత

ఊరిమీద మమకారంతో
రోగాల బారిన పడుతున్న
వృద్ధులు, చిన్నపిల్లలు





హనుమకొండ, మార్చి 21 (పోలీస్ నిఘా) : హనుమకొండ జిల్లా, రాంపూర్ గ్రామంలోని డంపింగ్ యార్డుకు సంబంధించిన తాజా సమాచారం, నివేదికలు పర్యావరణ ప్రభావం కింద ఇవ్వబడ్డాయి. రాంపూర్ డంపింగ్ యార్డ్ తీవ్రత గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాంపూర్ 31 ఎకరాల డంపింగ్ యార్డ్ వద్ద సుమారు 3 లక్షల టన్నులకు పైగా పాత వ్యర్థాలు పేరుకుపోయాయి. దీనివల్ల సమీప గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పర్యావరణ కాలుష్యం. ఈ డంపింగ్ యార్డ్ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలి, నీరు, నేల కాలుష్యం తీవ్రస్థాయిలో ఉంది. వర్షాకాలంలో ఈ వ్యర్థాల నుండి వచ్చే నీరు భూగర్భ జలాలను కలుషితం చేస్తోందని అధ్యయనాలు చెబుతున్నాయి. పీసీబీ నివేదికలు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదికల ప్రకారం, రాంపూర్ ప్రాంతంలోని డంపింగ్ యార్డ్ వద్ద నీటి నాణ్యత బిఐఎస్ పరిమితులను మించిపోయింది. తాజా జిటిఐ నివేదిక రాంపూర్ డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాల వేరుచేసే ప్లాంట్ సీగ్రేషన్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ నివేదికలు అందుబాటులో ఉన్నాయి.

రాంపూర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కోరుతూ స్థానికులు నిరసనలు తెలుపుతున్నారు. కానీ తాము ఎన్నుకున్న ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులు కార్పొరేటర్లు తమ సమస్యను పట్టించుకోవడంలేదని పూర్తిస్థాయిలో డంపింగ్ యార్డ్ ను ఇక్కడి నుంచి తరలించేందుకు క్షేత్రస్థాయిలో నిబద్ధత కనబడడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్య ఇలాగే కొనసాగితే మడికొండ రాంపూర్ కడిపికొండ ధర్మసాగర్ పెండ్యాల కాజీపేట వరకు ఈ కాలుష్యం గాలులు విస్తరించి నగర ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయని పర్యావరణ వేత్తలు ఆవేదన చెందుతున్నారు. పాలకులు ఇప్పటికైనా కండ్లు తెరిచి ఐఏఎస్ అధికారులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నటువంటి ఈ చెత్త డంపింగ్ యార్డును జనావాసాల నుంచి దూరంగా మార్చాలని లేకపోతే ఒక్కొక్కరుగా గ్రామం ఖాళీ చేయాల్సి వస్తుందని, నగరం చుట్టూ ఉన్న జనాలు సైతం శ్వాసకోశ, మూత్రపిండాలు, చర్మవ్యాధులు, గుండె జబ్బులు, కాలేయం వంటి వ్యాధులే కాకుండా చిన్న పిల్లలు వృద్ధులు అంటూ వ్యాధుల బారినపడి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఈ విషయమై దృష్టి సారించి జనాభాసాల మధ్యనున్న రాంపూర్ డంపింగ్ యార్డ్ ను వెంటనే తరలించి ప్రజలకు ఉపశమనం కలిగించే ప్రజారోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని ఇక్కడి ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఇక్కడ జరుగుతున్న నష్టాన్ని కొంతవరకు తగ్గించే ప్రయత్నాలు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## టపాసుల లారీలో అగ్నిప్రమాదం





రంగారెడ్డి, మార్చి 21 (పోలీస్ నిఘా) : రంగారెడ్డి జిల్లా,కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెంజర్ల రోడ్డు నుండి మాణిక్యమ్మగూడ మార్గమధ్యలో టపాసుల లోడ్‌తో వెళ్తున్న లారీలో శనివారం అకస్మాత్తుగా అగ్నిప్రమాదం సంభవించింది. తమిళనాడులోని శివకాశి నుండి మహేశ్వరం మరియు నిజామాబాద్‌కు టపాసులను తరలిస్తున్న లారీ (నెం. టీఎన్ 95 సి 5974)లో ఈ మంటలు చెలరేగాయి. ప్రాణాపాయం తప్పింది: లారీలో ఉన్న డ్రైవర్లు అయ్యప్పన్ మరియు సత్తివేల్ అప్రమత్తంగా వ్యవహరించి కిందకు దూకేయడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందిన వెంటనే కొత్తూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజిన్‌ను రప్పించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో విద్యుత్ తీగలు ఉండటంతో, వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సరఫరాను నిలిపివేయడం జరిగింది. దీనివల్ల పెను ప్రమాదం తప్పింది. షాద్‌నగర్ జోన్ డీసీపీ శ్రీమతి సి. శిరీష గారు మరియు ఏసీపీ శ్రీ లక్ష్మీనారాయణ గారు స్వయంగా ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం ధాటికి లారీ మరియు రోడ్డు పక్కన ఉన్న గడ్డి పూర్తిగా కాలిపోయాయి. ప్రస్తుతం జేసీబీ మరియు క్రేన్ల సహాయంతో బూడిదైన లారీని పక్కకు తొలగించి, రహదారిని శుభ్రం చేయడం జరిగింది. వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాము.

## పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ సీజ్




హైదరాబాద్, మార్చి 21 (పోలీస్ నిఘా) : సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌ను రెవెన్యూ అధికారులతో కలిసి సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ వ్యవహారంతో పాటు భూ అక్రమాల అంశం కూడా ఇప్పుడు తెరపైకి రావడంతో ఈ కేసు విచారణ వేగవంతమైంది. మొయినాబాద్‌లోని రోహిత్ ఫామ్‌హౌస్ గత కొంతకాలంగా వివాదాలకు నిలయంగా మారింది. తాజాగా రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అసైన్డ్ భూమిలో ఈ ఫామ్‌హౌస్‌ను నిర్మించారని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఈ నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలోనే ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

**పోలీసుల కఠిన చర్యలు..**

డ్రగ్స్ పార్టీ జరిగిన సమయంలో అక్కడికి వచ్చిన వారి వాహనాలను సైతం పోలీసులు ఇప్పటికే సీజ్ చేశారు. ఆ వాహనాల యజమానులు ఎవరు.. పార్టీకి ఎవరెవరు హాజరయ్యారు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక విచారణ బృందం కోర్టు తీర్పు అనంతరం రోహిత్ రెడ్డిని కస్టడీలోకి తీసుకోనుంది. అనంతరం ఆయన్ని నేరుగా ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి, అక్కడ జరిగిన పార్టీ వివరాలు, ఇతర ఆధారాల కోసం క్షేత్రస్థాయిలో విచారించనున్నట్లుగా సమాచారం.

**సిట్ దూకుడు**

ఇదిలావుండగా, సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో 'సిట్' దూకుడు పెంచింది. ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను 'సిట్' అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన 'సిట్' ఎట్టకేలకు అతడిని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సరఫరా చేశాడు. అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు.

## రామనామంతో మారుమ్రోగిన భద్రాచల రామాలయం



భద్రాచలం, మార్చి 21 (పోలీస్ నిఘా) : రామాలయంలో భక్తి తరంగాలు ఉప్పొంగుతున్నాయి. స్వామివారి దర్శనం కోసం దూరదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. "ఒక్కసారి స్వామి దర్శనం చేస్తే చాలు" అన్న ఆతృతతో కుటుంబాలతో కలిసి వచ్చిన భక్తుల సందడి కనిపిస్తోంది. క్యూలైన్‌లలో గంటల తరబడి నిలబడినా, భక్తుల ముఖాల్లో అలసట కంటే ఆనందమే ఎక్కువగా కనిపిస్తోంది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ భక్తి భావంతో ముందుకు సాగుతూ, స్వామివారి దర్శనం పొందుతున్నారు. అలయ ఘంటానాదాలు, భక్తుల జైకారాలతో పరిసరాలు ఆధ్యాత్మిక మాధుర్యంతో మార్మోగుతున్నాయి. అధికారులు కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పిస్తూ, దర్శనాన్ని సాఫీగా నిర్వహిస్తున్నారు. భక్తుల రాకపోకలతో రామాలయం ఆధ్యాత్మిక క్షేత్రంగా కళకళలాడుతూ, భక్తి భావాన్ని మరింతగా విస్తరిస్తోంది.

## త్వరలో భద్రగిరి మార్ట్‌లో గిరిజన మహిళల ఉత్పత్తులు అందుబాటులోకి





భద్రాచలం, మార్చి 21 (పోలీస్ నిఘా) : మారుమూల ప్రాంతాల గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాల ఎస్. హెచ్. జి. సభ్యులు, గిరిజన రైతులు తయారు చేస్తున్న సూక్ష్మ, చిన్న తరహా ఉత్పత్తులకు ఆర్థిక ప్రోత్సాహం కల్పించేందుకు భద్రాచలంలో ఏర్పాటు చేస్తున్న "భద్రగిరి మార్ట్" కీలక వేదికగా మారనుంది. ఈ నెలలో ప్రారంభం కానున్న ఈ మార్ట్‌లో గిరిజన మహిళలు తయారు చేసిన ఆరు రకాల సబ్బులు, అలోవెరా షాంపూలను వినియోగదారులకు అందుబాటులో ఉంచనున్నట్లు ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. శనివారం భద్రాచలం పట్టణంలోని శ్రీ దమ్మక్క జాయింట్ లీయాబిలిటీ గ్రూప్‌ను ఆయన సందర్శించి, అక్కడ తయారు చేస్తున్న సబ్బులు, షాంపూల నాణ్యతను పరిశీలించారు. ఈ ఉత్పత్తులు శుభ్రత ప్రమాణాలు పాటిస్తూ, మన్నికగా తయారు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే గృహావసరాలకు ఉపయోగపడే మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్లు తయారీ విధానం, ముడి సరుకుల శుద్ధి ప్రక్రియను కూడా ఆయన సమీక్షించారు. టమాటా, మామిడి, ఉసిరికాయ, నిమ్మకాయ వంటి పచ్చళ్ల తయారీ విధానాన్ని పరిశీలించి, వాటిని వినియోగదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోషక విలువలు కలిగిన వివిధ రకాల నూనెలను కూడా సరసమైన ధరలకు భద్రగిరి మార్ట్ ద్వారా అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడీఏ సిబ్బంది సాయి చంద్, భూదేవి, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, మణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ నిఘా
సంపాదకీయం | ఆదివారం | 22 మార్చి 2026

## ఆర్థిక నిర్వహణలో తెలంగాణ టాప్

ప్రజా ఆర్థిక నిర్వహణ (పబ్లిక్ ఫైనాన్స్)లో దేశంలో మెరుగ్గా ఉన్న రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవడం చెప్పుకోదగిన విశేషం. సామాజిక, ఆర్థిక నివేదికలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన ఆర్థిక ఆరోగ్య సూచిక నివేదికలో తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని కనబరిచింది. 202324 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన డేటా ఆధారంగా నీతి ఆయోగ్ విడుదల చేసిన 'ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్ 2026' నివేదికలో దేశంలోనే అత్యుత్తమ ఆర్థిక నిర్వహణ గల రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తూ తెలంగాణ 8వ స్థానం నుండి 7వ స్థానానికి ఎగబాకింది. అదే సమయంలో 'ఫ్రంట్ రన్నర్' హోదాను కూడా నిలబెట్టుకుంది. స్థిరమైన ఆర్థిక వృద్ధిని ప్రతిబింబిస్తూ జాతీయ స్థాయిలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ఈ నివేదిక ప్రకారం ఒడిశా, గోవా, జార్ఖండ్ రాష్ట్రాలు 'టాప్ అచీవర్స్' (అగ్ర స్థాయి సాధకులు) వర్గంలో అగ్రస్థానంలో నిలిచాయి. ఈ రాష్ట్రాలు బలమైన ఆర్థిక క్రమశిక్షణ, సొంత పన్ను ఆదాయం, తక్కువ ద్రవ్యలోటు, అప్పుల నిర్వహణలో మెరుగైన పద్ధతిని ప్రదర్శించాయి. 'అత్యల్ప ఆకాంక్షిత' (లోయెస్ట్ ఆస్పిరేషనల్) వర్గంలో కేరళ, పంజాబ్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నిలిచాయి. దేశంలోని రాష్ట్రాల ఆర్థిక పనితీరును అంచనా వేయడానికి నీతి ఆయోగ్ నాలుగు విస్తృత విభాగాలుగా వర్గీకరించింది. అచీవర్స్ (సాధకులు టాప్ టైర్), ఫ్రంట్ రన్నర్స్, పెర్ఫార్మర్స్, ఆస్పిరేషనల్ (ఆకాంక్షిత) అనే నాలుగు కేటగిరీలుగా సమీక్షించింది. ఫ్రంట్ రన్నర్ వర్గం అంటే సాధారణంగా మంచి ఆర్థిక స్థితిని కలిగి ఉన్న రాష్ట్రాలు. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ఫ్రంట్ రన్నర్ వర్గంలో నిలిచాయి. 'కాలక్రమేణా తెలంగాణ ఆర్థిక నిర్వహణ మెరుగుపడింది. జాతీయ సగటు కంటే అధిక వృద్ధి రేటు, సొంత పన్నుల రాబడి పెంపుదల, సంక్షేమ, అభివృద్ధి పథకాల సమతుల్యత, ఇవన్నీ తెలంగాణ ఆర్థిక సూచిక ఎదగడానికి కారణాలు. ఈ రాష్ట్రం తన స్వంత ఆదాయ వనరులను మెరుగుపర్చుకోవడంలో, సబ్సిడీ చెల్లింపును సమతుల్యం చేయడంలో నిలకడైన ప్రగతిని కనబర్చింది. అయితే రెవెన్యూ లోటును నియంత్రించాల్సి ఉందని, అప్పుల ద్వారా కాకుండా స్వంత ఆదాయ వనరుల ద్వారానే ఖర్చులను భరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఫిస్కల్ హెల్త్ ఇండెక్సులో 44.3 పాయింట్లు స్కోరు చేసి 8వ స్థానం నుంచి 7వ స్థానానికి తెలంగాణ ఎదగ్గా, దీనికి విరుద్ధంగా 23.1 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ 17వ స్థానంలో నిలిచింది. రాష్ట్రాలు ప్రజాధనాన్ని ఎంత సమర్థవంతంగా ఖర్చు చేస్తున్నాయో కూడా ఈ సూచిక పరిశీలించింది. అభివృద్ధి పనులు, మూలధన వ్యయంపై సమర్థవంతంగా ఖర్చు చేస్తున్నట్టు తేలడంతో 57.1 పాయింట్ల స్కోరుతో 'అచీవర్ కేటగిరీ' ని తెలంగాణ సాధించింది. అప్పుల నిర్వహణలో కూడా 53.5 పాయింట్ల స్కోరుతో తెలంగాణ ఫ్రంట్ రన్నర్‌గా నిలిచింది. తక్కువ వడ్డీ, ఇవిఎంల ఒత్తిడి విషయంలో ఆదాయానికి, అప్పులకు మధ్య సరైన సమతుల్యత పాటించింది. రుణస్థిరత్వం అన్నది అనేక రాష్ట్రాలకు ఆందోళనకరమైన అంశంగా ఉంటున్న నేపథ్యంలో ఈ సూచికలో తెలంగాణ 20.0 పాయింట్లు సాధించగా, ఆంధ్రప్రదేశ్ కేవలం 4.2 పాయింట్లు మాత్రమే సాధించగలగడం గమనార్హం. రెండు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థల దీర్ఘకాలిక స్థిరత్వాన్ని మెరుగుపర్చుకోవడానికి ఆస్కారం ఉందని ఈ నివేదిక సూచిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ పేదరిక నిర్మూలన, సామాజిక సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తూ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా అడుగులు వేస్తోంది. 2019 20 ఆర్థిక సంవత్సరంలో రూ. 16,860 కోట్లుగా ఉన్న మూలధన వ్యయం 2023 నాటికి రూ. 43,918 కోట్లకు పెరిగి, ఐదేళ్లలో 160 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేసింది. ఈ గణనీయమైన పెరుగుదల రాష్ట్రంలో ఆస్తుల సృష్టిని, దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తూనే హైదరాబాద్ మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ విస్తరణ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు భారీ ఎత్తున నిధులు కేటాయిస్తోంది. ఇంత భారీ వ్యయం ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం తన ఆర్థిక క్రమశిక్షణను కాపాడుకుంటూ ఎఫ్ఆర్‌బిఎం చట్టం ప్రకారం రుణపరిమితులను నియంత్రణలో ఉంచిందని చెబుతున్నారు. రుణజిఎస్‌డిపి నిష్పత్తిని 30% కంటే తక్కువగా అంటే సుమారు 2728 శాతం కొనసాగిస్తోంది. ఉప్పల్, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల్లో మెరుగైన సౌకర్యాల కోసం మౌలిక సదుపాయాల కల్పన, హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయిలో రూ. 60,799 కోట్లతో రోడ్ల నిర్మాణం, క్రీడా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ఇవన్నీ రాష్ట్రంలో ఆస్తుల సృష్టిని, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వ చొరవను బలపరుస్తున్నాయి. దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి కోసం పరిశ్రమలు, ఐటి రంగం విస్తరణ, మున్సిపల్ శాఖల్లో పెట్టుబడులు ప్రధానంగా ఉంటున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత ఆర్థికాభివృద్ధిలో స్థిరమైన ప్రగతి కనిపిస్తోంది. రాష్ట్ర తలసరి ఆదాయం గణనీయంగా పెరిగి రూ. 3.87 లక్షలకు చేరుకుంది. ఇది దేశంలోని ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే అత్యధికం. పర్యాటకం, పరిశ్రమలు, క్రీడలు, సామాజిక సమ్మిళిత్వంతో సమగ్ర విధానాలను అమలు చేస్తోంది. ఆర్థిక నిర్వహణ సమర్థవంతంగా ఉండడం, పన్నుల వసూలులో డిజిటల్ టెక్నాలజీ ఉపయోగించడం, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు సరైన ప్రాధాన్యత కల్పించడం ఇవన్నీ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చే లక్ష్యానికి ఊతం ఇస్తున్నాయి.

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే దొంతి




చెన్నారావుపేట , మార్చి 21 (పోలీస్ నిఘా) : వరంగల్ జిల్లా అమీనాబాద్ చెన్నారా వుపేట గ్రామాలలో పవిత్ర రంజాన్ పండుగ పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు ముస్లిం మైనార్టీ సోదర సోదరిమణులకి నర్సం పేట ఎమ్మెల్యే దొంతి రంజాన్ పండుగ శుభా కాంక్షలుతెలిపారు. రంజాన్ సందర్భంగా ముస్లిం మత పెద్దల ఆహ్వానం మేరకు పవిత్రమైన రంజాన్ పండుగ పర్వది నాన్ని పురస్కరించుకొని నర్సంపేట శాసనసభ్యు లు దొంతి మాధవ రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీ సోదర సోదరిమణులకి ప్రజలకు పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవ డానికి,మంచి మార్గంలో నడవడానికి దోహదపడతాయని అన్నారు..ముస్లిం సోదరులు చేసే ప్రతి ప్రార్థనకు అల్లాహ్ ఆశీస్సులు లభించి, అందరి జీవితాల్లో ఆనందం,శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజ కవర్గ నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ జిల్లా బ్లాక్ మండల కమిటీ నాయకులు గ్రామ సర్పంచ్ దార రంజిత్ ఉప సర్పంచ్ బండి హరీష్ గ్రామ కాంగ్రెస్ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు ముస్లిం మైనారిటీ మత పెద్దలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్రిష మరో జయలలిత అవుతుందా?




సినిమా స్టార్స్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వడం కొత్తేమీ కాదు. ఇప్పటికే చాలా మంది సినిమా తారలు రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి, రాష్ట్రాలను ఏలారు. తమిళనాడులో ఎంజీఆర్, తెలుగులో సీనియర్ ఎన్టీఆర్ పాలిటిక్స్‌లో తమదైన ముద్ర వేశారు. వారి బాటలోనే తమిళ, తెలుగు హీరోయిన్లు పొలిటికల్ స్క్రీన్‌పై మెరిసారు. ఎంజీఆర్ సన్నిహితురాలు జయలలిత ఆయన తదనంతరం ఏఐడీఎంకే అధినేత్రిగా తమిళనాడు సీఎం పీఠం అధిరోహించి చక్రం తిప్పారు. తాజాగా స్టార్ హీరోయిన్ త్రిష పొలిటికల్ ఎంట్రీకి రెడీ అయ్యారన్న ప్రచారం జోరందుకుంటోంది. జయలలిత, ఎం.జే.ఆర్ తరహాలో తమిళనాట రాజకీయాల్లో రాణించాలని త్రిష చూస్తున్నారని తెలుస్తోంది. తెలుగు, తమిళ భాషల్లో త్రిష స్టార్ హీరోయిన్ గా రాణించింది. దాదాపు అందరు స్టార్ హీరోల సరసన త్రిష హీరోయిన్ గా నటించి మెప్పించింది. ప్రస్తుతం తమిళంలో లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తూ అలరిస్తున్నది. ఇక ఇప్పుడు త్రిష రాజకీయ ప్రవేశం వెనక టీవీకే పార్టీ అధినేత, హీరో విజయ్ ఉన్నారంటున్నారు. ఇప్పటికే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఓ వైపు డీఎంకే కాంగ్రెస్ కూటమి, మరో వైపు అన్నాడీఎంకే, బీజేపీ కూటములు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు తమదంటే తమదని ఉద్ధృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఇప్పుడు ఆ రెండు కూటములతో పాటు టీవీకే అధినేత విజయ్ సీఎం సీటుపై కన్నేశారు. ఇప్పటికే విజయ్ తమిళనాడు వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలతో ఎలక్షన్ క్యాంపెయిన్ హోరెత్తిస్తున్నారు. అంతా సవ్యంగా సాగుతున్న సమయంలో విజయ్ నుంచి విడాకులు కోరుతూ ఆయన భార్య కోర్టు గడపతొక్కడంతో ఈ విషయం ఇటు తమిళనాడులోనే కాకుండా దక్షిణాది రాజకీయాల్లో సైతతం హాట్ టాపిక్‌గా నిలిచింది. త్రిష కారణంగానే వారి పెళ్లి పెటాకులవ్వబోతోందన్నది ఓపెన్ సీక్రెట్టే. విషయం ఓపెన్ అయి పోవడంతో.. నిండా మునిగాక చలేముందిలే అన్నట్లుగా విజయ్ కూడా చాలా ఓపెన్ అయ్యాడు. భార్య బ్లాక్‌మెయిల్‌కు బెదిరేది లేదని ప్రజలకు స్పష్టం చేయడానికా అన్నట్లు... ఇటీవల ఓ పెళ్లి వేడుకకు త్రిషతో కలిసి హాజరై అందరికీ షాక్ ఇచ్చాడు. దాంతో త్రిషతో ఉన్న రిలేషన్‌షిప్ పై వస్తున్న వార్తలకు బలం చేకూర్చినట్లైంది. హీరో విజయ్ కొత్త పార్టీ టీవీకే తొలిసారిగా ఎన్నికల్లో నిలవబోతోంది. ఇప్పటికే అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో విజయ్ ఉన్నారు. ఈ క్రమంలోనే చెన్నై అసెంబ్లీ సీటును విజయ్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు కనిపిస్తోంది. సినిమా రంగానికి, రాజకీయాలకు విడదీయలేని బంధం ఉన్న తమిళనాడులో చెన్నై పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేక స్థానం ఉంది. చెన్నై నార్త్, సెంట్రల్, సౌత్ అసెంబ్లీ స్థానాల నుండి పలువురు నటీనటులు విజయం సాధించి చట్టసభల్లో అడుగుపెట్టారు. ఎంజీఆర్, తర్వాత జయలలిత, మరో మాజీ సీఎం కరుణానిధి చెన్నై నగరం నుంచే గెలిచారు ప్రస్తుత తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చెన్నై నుండే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ క్రమంలోనే అక్కడి నుంచి నటి త్రిషను టీవీకే పార్టీ టికెట్ పై పోటీ చేయించాలని భావిస్తున్నారని తమిళ పాలిటిక్స్‌లో ప్రచారం జరుగుతోంది. అయితే తన రాజకీయ అరంగేట్రంపై ఇంకా క్లారిటీ ఇవ్వని త్రిష, రానున్న ఎన్నికల్లో చెన్నైలోని ఏ అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి దిగుతారన్నది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది.

ఏదిఏమైనా తమిళనాడు రాజకీయాలు ప్రస్తుతం హీరోయిన్ త్రిష చుట్టే తిరుగుతున్నాయి. విజయ్ టీవీకే పార్టీ ఎన్డీఏతో పొత్తు పెట్టుకునే నిర్ణయం ఆమె చేతుల్లోనే ఉందని వార్తలొస్తున్నాయి. ఇటీవల అమిత్ షాతోనూ త్రిష భేటీ అయ్యారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఏఐడీఎంకే నేతలూ త్రిషతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

దీంతో ఎన్నికలు సమీపిస్తున్న వేళ త్వరలోనే తమిళ రాజకీయాల్లో సంచలనాలు ఖాయంగా కనిపిస్తున్నాయి. మరి త్రిష తమిళనాడు రాజకీయాల్లో మరో జయలలిత అనిపిం చుకుం టారో? లేకపోతే శశికళలా మిగిలిపోతారో చూడాలి.

# ఇరాన్ బలం వెనక ఆ రహస్యం ఏంటి?



ఇరాన్–అమెరికా–ఇజ్రాయెల్ వార్ 20 రోజులైనా ఉధృతి తగ్గడం లేదు. ఇజ్రాయెల్‌ను ఎదుర్కొనడానికి ఇరాన్‌కు పెద్ద వార్ బేస్‌లు కావాలి. కానీ అవేమీ లేకపోయినా ఇరాన్ అమెరికా, ఇజ్రాయెల్‌ను ఎదర్కొంటూనే గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తోంది. తాజాగా బహ్రెయిన్‌లోని ఎత్తయిన భవనంపై దాడి చేసింది. అంటే ఇజ్రాయెల్ సైనిక శక్తి కూడా ఇంకా బలంగానే ఉంది. అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్మీ ఉన్న దేశం. సైన్యానికే ఒక ట్రిలియన్ డాలర్ల బడ్జెట్ ఖర్చు చేస్తుంది. దానివద్ద పెద్ద ఎత్తున ఆయుధాలు ఉన్నాయి. కానీ ఇరాన్ యుద్ధాన్ని దీర్ఘకాలం కొనసాగించడం ద్వారా అమెరికాపై ఒత్తిడి తేవడంతోపాటు ఆర్థికంగా దెబ్బతీయాలని చూస్తోంది. గల్ఫ్ దేశాలపై దాడి చేయడం, హార్ముజ్ జలసంధి మూసివేత ద్వారా ప్రపంచ దేశాలు అమెరికాపై ఒత్తిడి తెచ్చేలా యత్నిస్తోంది.

**ఐఆర్‌జీసీనే ఇరాన్ ప్రధాన ఆయుధం..**

ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) సుప్రీం లీడర్ నియంత్రణలో ఉంటుంది. దేశంలోనూ, దేశం వెలుపల ఆపరేషన్లు నడుపుతుంది. దీనికి స్వతంత్ర ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ బలగాలు ఉన్నా. తాజాగా బహ్రెయిన్ దాడి చేసింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మరణం తర్వాత ఆయన కొడుకు మోజ్తాబా ఖమేనీ ఎన్నికయ్యారు. అయితే ఆయన కూడా గాయపడ్డాడని, రహస్యంగా రష్యా వెళ్లి చికత్స తీసుకుంటున్నాడని సమాచారం. అయినా ఐఆర్‌జీసీ యుద్ధం కొనసాగిస్తోంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై హెచ్చరికలు ఈ బలాన్ని తెలియజేస్తున్నాయి.

**కొండల కింద ఆయుధాలు..**

ఇక ఇరాన్ మరో బలం పొడవైన, ఎత్తయిన కొండలు. ఈ కొండల కింద ఇరాన్ పెద్ద ఆయుధాగారం నిర్మించింది. ఇక్కడే అణు కార్యకలాపాలు కూడా నిర్వహిస్తోంది. మిస్సైళ్లు, లాంచర్లు, డ్రోన్లు ఇతర ఆయుధాలు ఇక్కడే ఉన్నాయి. ఇసుక దిబ్బల నుంచి ఆయుధాలను ప్రయోగిస్తోంది. ఇరాన్ మొత్తన్ని అమెరికా ధ్వంసం చేసినా ఆయుధాలను టచ్ చేయలేదు.

**ఆర్థిక ఒత్తిడి వ్యూహం**

అమెరికా, ఇజ్రాయెల్ సైనిక ఆధిక్యతకు మించి ఇరాన్ దీర్ఘయుద్ధంతో ఆర్థిక దెబ్బ తీయాలని చూస్తోంది. గల్ఫ్ దాడులు, జలసంధి అవరోధాలు ప్రపంచ ఆయిల్ సరఫరాను దెబ్బతీస్తూ అమెరికా మీద ఒత్తిడి పెంచుతాయి. ఈ పరోక్ష పోరాటం సంప్రదింపులకు దారి తీయవచ్చు.

**ఇజ్రాయెల్ శాంసన్ వ్యూహం..**

ఇక ఇజ్రాయెల్ తమపై దాడి చేస్తే సాంసన్ ప్లాన్ అమలుకు సిద్ధంగా ఉంది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ అణుదాడి చేస్తే ఇరాన్ శాంసన్ ప్లాన్‌లో భాగంగా జలాంతర్గాములతో అణుదాడిని ప్రపంచదేశాలపై చేయడానికి సిద్ధంగా ఉంచింది. తాము నాశనమైతే ప్రపంచం మొత్తం నాశనం కావాలనేది ఇజ్రాయెల్ శాంసన్ వ్యూహం. ఐఆర్‌జీసీ ఆధారంతో ఇరాన్ యుద్ధం ఉధృతంగా కొనసాగిస్తోంది. దీంతో ప్రాంతీయ అస్థిరత పెరుగుతుంది, రష్యా, చైనా మద్దతు బలపడవచ్చు. అయితే ఆర్థిక ఒత్తిడి ఇరాన్‌కు సవాల్‌గా మారవచ్చు. ఈ సంఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన ధరలను మార్చే అవకాశం ఉంది.

# యుద్ధం తెచ్చిన ఆకలి రాజ్యం ఇది..




కొన్ని దశాబ్దాల క్రితం కమల్ హాసన్ హీరోగా ఆకలి రాజ్యం అనే సినిమా వచ్చింది.. గుర్తుందా.. డిగ్రీ చదివినప్పటికీ.. సరైన ఉద్యోగం లేక కమలహాసన్.. అతడు స్నేహితులు తీవ్రంగా ఇబ్బంది పడతారు. కనీసం తినడానికి తిండి కూడా ఉండదు. ఓ సందర్భంగా కమల్ హాసన్, అతడి స్నేహితులు ఉండే గదికి శ్రీదేవి వస్తుంది. ఆమె ముందు తాము పంచభక్ష్య పరమాన్నాలు తింటున్నట్టుగా కమలహాసన్, అతడి స్నేహితులను నటిస్తారు. మొదట్లో ఇది నిజమని శ్రీదేవి భావిస్తుంది. అనుమానం వచ్చి చూస్తే.. ఆ గదిలో ఖాళీ గిన్నెలు తప్ప ఏమీ ఉండవు. ఆ సన్నివేశం యూట్యూబ్ లేదా టీవీలలో చూస్తే ఇప్పటికి కన్నీళ్లు వస్తూనే ఉంటాయి. ఎందుకంటే ఆకలికి కులం ఉండదు, మతం అంతకంటే ఉండదు. సమయానికి ఆకలిగా ఉన్న కడుపుకు ఇంత ఆహారం పడితే క్షుద్బాధ తీరుతుంది. శరీరం సత్తువను పెంచుకొని ముందుకు సాగుతూ ఉంటుంది. అందువల్లే ఈ జీవికైనా సరే ఆహారం అనేది అత్యంత ముఖ్యం. పీల్చేగాలి.. తాగే నీరు తర్వాత ఆహారం అనేది అత్యంత అవసరం..

ప్రకృతి విపత్తులు చోటు చేసుకున్నప్పుడు అనేక రకాల అనర్థాలు జరుగుతాయి. అవి మనిషి జీవితం మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంటాయి. ఈ ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన అనేక యుద్ధాలు మనిషి జీవితం మీద అత్యంత తీవ్రంగా ప్రభావం చూపించాయి. గూడు పరంగా.. కూడు పరంగా.. భవిష్యత్తు పరంగా ఎన్నో ప్రతికూల ఫలితాలను మనిషి చవి చూశాడు. అయితే పెద్ద దేశాల యుద్ధకాంక్ష వల్ల.. పెత్తందారి వ్యవస్థను కొనసాగించాలనే తీరు వల్ల యుద్ధాలు వస్తున్నాయి.

ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం సాగుతోంది. ఈ యుద్ధం మొదట్లో కొద్ది రోజుల వరకు సాగుతుందని అందరూ అనుకున్నారు. అమెరికా దుర్మార్గం.. ఇజ్రాయిల్ మొండితనం.. ఇరాన్ పోరాటం.. వీటివల్ల మధ్య ప్రాచ్యం రావణ కాష్టం లాగా మండుతోంది. ఈ యుద్ధం ఇంకా ఎన్ని రోజులు సాగుతుందో తెలియదు. కాకపోతే ఈ యుద్ధం వల్ల ఎదురవుతున్న ప్రతికూలతలను ప్రపంచం ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎదుర్కొంటున్నది. ఇప్పటికే చాలా వరకు దేశాలలో పెట్రోల్, డీజిల్ నిల్వలు నిండుకున్నాయి. అమెరికా లేని పంతానికి పోతోంది. ఇజ్రాయిల్ పట్టు విడవడం లేదు. ఇరాన్ ఏ మాత్రం తగ్గడం లేదు.. ఫలితంగా ప్రపంచం మొత్తం ఒత్తిడి ఎదుర్కొంటున్నది. అయితే ఈ యుద్ధం కేవలం చమురు, గ్యాస్ వరకే ఆగిపోవడం లేదు. అనేక దేశాల ఆర్థిక పరిస్థితులు తారుమారవుతున్నాయి. వంట నూనెలు.. ఆహార గింజలు.. ఎండు ఫలాలు.. ఔషధాలు.. ఖనిజాలు.. ముడి పదార్థాలు.. పండ్లు.. చర్మ ఉత్పత్తులు.. ఇలా ప్రతి విభాగము తీవ్రమైన ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నది. దీని ఆధారంగా సాగే పరిశ్రమలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. సకాలంలో దిగుమతులు, ఎగుమతులు జరగకపోతే ధరల స్థాయి అనేది పెరిగిపోతూ ఉంటుంది. ఇప్పటికే వంట నూనెల ధరలు సలసలా కాగుతున్నాయి. కోవిడ్ నాటికంటే ఎక్కువ ధరలతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పప్పు దినుసులు.. తిండి గింజల ధరలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. ఇక బ్రాయిలర్, లేయర్ కోళ్ల ధరలు కూడా విపరీతంగా ఉన్నాయి. హైదరాబాద్ మార్కెట్లో స్కిన్లెస్ బ్రాయిలర్ చికెన్ ధర కిలోకు 380 వరకు పలుకుతుందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అందువల్లే యుద్ధమనేది ఎప్పుడైనా సరే వినాశనాన్ని మాత్రమే కోరుతుంది. దానివల్ల ప్రపంచం మొత్తం తీవ్రంగా ప్రభావితం అవుతుంది. అప్పుడు ఆహారం దొరకదు. ఆకలి తీరదు. సింపుల్ గా చెప్పాలంటే ఆకలి రాజ్యం సినిమా లైవ్ లో కనిపిస్తూ ఉంటుంది. ఇంత యుద్ధం చేసిన తర్వాత.. ఈ స్థాయిలో ఘోరాలకు పాల్పడ్డ తర్వాత.. మనుషులు సాధించింది ఏమైనా ఉందంటే.. అది ఒకరిని ఒకరు చంపుకోవడం మాత్రమే.

# దుబాయా.. మీకో దండం. వద్దు బాబోయ్!




మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం నెలకొంది. దీంతో అక్కడి పరిస్థితులు దారుణంగా మారిపోయాయి. యుద్ధం వల్ల విపరీతంగా మిసైల్స్ దూసుకు వస్తున్నాయి. విమానాశ్రయాలు.. నౌకాశ్రయాలు.. జన సమర్థ ప్రాంతాలలో మిస్సయిల్స్ పడిపోతున్న నేపథ్యంలో నష్టం తీవ్రత అధికంగా ఉంది. మిడిల్ ఈస్ట్ లో దుబాయ్ అనేది అత్యంత కీలకమైన ప్రాంతం. ఇక్కడ ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగిస్తున్నారు. దుబాయ్ అనేది నిత్యం పర్యాటకులతో సందడిగా ఉంటుంది. విమానాశ్రయం అయితే నిత్యం రద్దీగా ఉంటుంది. అంతర్జాతీయ విమానాలతో ఆ ప్రాంతం మొత్తం జనాలతో కిటకిటలాడుతూ ఉంటుంది. దుబాయ్ రియల్ ఎస్టేట్.. బంగారం.. రిసార్ట్.. బీచ్.. ఎడారులకు సుప్రసిద్ధి ప్రాంతం. అందువల్లే దుబాయ్ నగరంలో విహరించాలని.. ఆ ప్రాంతంలో సందడి చేయాలని చాలా మంది అనుకుంటారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు ఎక్కువగా సందర్శించే ప్రాంతాలలో దుబాయ్ ముందు వరుసలో ఉంటుందంటే.. అక్కడి టూరిస్ట్ డెస్టినేషన్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో.. దుబాయ్ వెళ్ళడానికి ఎవరూ సాహసం చేయడం లేదు. ఫలితంగా నిత్యం రద్దీగా ఉండే విమానాలు ఖాళీగా ఉంటున్నాయి.. దుబాయ్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే విమానాలు ప్రయాణికులతో రద్దీగానే ఉంటున్నాయి. తిరిగి వచ్చేటప్పుడు మాత్రం అంతగానే ప్రయాణికులు కనిపిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఏమి రేట్స్ కంపెనీకి చెందిన విమానాలు ప్రయాణికులు లేకపోవడంతో.. ఆర్థికంగా విపరీతమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయితే ఖాళీగా వెళ్తున్న విమానాలలో సరుకులను తరలిస్తున్నాయి విమానయాన కంపెనీలు. సరుకు రవాణా ద్వారా కాస్తలో కాస్త నష్టాన్ని పూడ్చుకునే అవకాశం ఉంటున్నదని విమానయాన సంస్థలు చెబుతున్నాయి. సరుకు రవాణా ద్వారా ప్రత్యామ్నాయ ఆదాయ వనరు లభిస్తున్నదని విమానయన సంస్థలు వెల్లడిస్తున్నాయి. "దుబాయ్ ఒకప్పుడు పర్యాటకులకు స్వర్గధామం. ఇప్పుడు అక్కడ పరిస్థితి మారిపోయింది. విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకొని మిస్సైల్స్ దూసుకు వస్తున్నాయి. దీనివల్ల నష్టం విపరీతంగా ఉంటోంది. విమానాలు నడుస్తున్నప్పటికీ.. దుబాయ్ ప్రాంతాన్ని సందర్శించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో స్వర్గధామం కాస్త. . ఖాళీ ధామం అవుతోందని" విమానయాన సంస్థల సిబ్బంది చెబుతున్నారు.

## బీజేపీ బలోపేతమే లక్ష్యం

### -కడెం శిక్షణా తరగతులకు జన్నారం శ్రేణుల తరలింపు-



ఉమ్మడి అదిలాబాద్ , మార్చి 21 (పోలీస్ నిఘా) : భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. కడెంలో నిర్వహిస్తున్న బీజేపీ శిక్షణా తరగతులకు జన్నారం మండలం నుండి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. శనివారం మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో తరలివెళ్లిన ఈ బృందం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది.

**సంస్థాగత బలోపేతమే ధ్యేయం**

ఈ సందర్భంగా మధుసూదన్ రావు మాట్లాడుతూ, గ్రామాల్లో పార్టీని సంస్థగతంగా పటిష్టం చేయడమే ఈ శిక్షణా తరగతుల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి, బీజేపీని మండలంలో తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు.

**ముఖ్య అంశాలు...**

నాయకత్వ పటిష్టత: ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు ఈ తరగతుల ద్వారా పార్టీ వ్యూహాలపై పట్టు సాధించాలని సూచించారు.

ప్రజా సేవ: క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని కోరారు.

కార్యకర్తల ఉత్సాహం: జన్నారం నుండి పెద్ద ఎత్తున వాహనాల్లో తరలివెళ్లిన కార్యకర్తలు, పార్టీ నినాదాలతో పరిసరాలను హోరెత్తించారు.

బీజేపీని మండలంలో అత్యంత శక్తివంతమైన రాజకీయ శక్తిగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నేతలు, వివిధ గ్రామాల శక్తి కేంద్రాల ఇన్చార్జులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన రంజాన్ ప్రార్థనలు

### ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్





సంగారెడ్డి, మార్చి 21 (పోలీస్ నిఘా) : రంజాన్ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి వ్యాప్తంగా అన్ని ఈద్గా వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈద్గా వద్ద ప్రార్థనలకై వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక బందోబస్త్ ఏర్పాట్లను చేసినట్లు ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలు కుల మతాలకు అతీతంగా సుఖ:సంతోషాలతో, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సంగారెడ్డి ఈద్గా వద్ద బందోబస్తులో సంగారెడ్డి డియస్పీ సత్తయ్య గౌడ్, టౌన్ ఇన్స్పెక్టర్ రాము నాయుడు, రూరల్ ఇన్స్ స్పెక్టర్ క్రాంతి కుమార్, విమెన్ పిఎస్ ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, ఎస్ఐలు, క్విక్ రియాక్షన్ టీమ్స్ తదితరులు ఉన్నారు.

### ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన

## బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాణా ప్రతాప్ రెడ్డి



చెన్నారావుపేట, మార్చి 21 (పోలీస్ నిఘా) : నర్సంపేట నియోజ కవర్గం, చెన్నారావుపేట మండలం, గొల్లపల్లి గ్రామంలో యువకులు కలిసి అక్కడ ఉన్నా ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తున్నారు. విషయం ఆ గ్రామ యువకులు తెలియజే యగా ఆలయ నిర్మా ణానికి తనవం తుగా 10,116/ రూపా యలు విరాళం అందచే సిన భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా॥ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

## శ్రీ భద్రకాళి దేవస్థానంలో వైభవంగా వసంత నవరాత్ర మహోత్సవములు



వరంగల్, మార్చి 21 (పోలీస్ నిఘా) : మూడవ రోజు కార్యక్రమాలలో భాగంగా శనివారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం జరుపడిన పిమ్మట కల్పోక్త ప్రకారం వసంత నవరాత్ర ఉత్సవాల సందర్భంగా జరుపవలసిన విశేష జపహెమార్చనా భిషేకములు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లక్ష మల్లె పూలతో అర్చన జరిపి అమ్మవారికి నివేదనలు సమర్పించి భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. ఈ రోజు లక్ష పుష్పార్చన కార్యక్రమానికి వరంగల్ ప్రముఖ న్యాయవాది శ్రీ భాస్కరవజ్ఝల పురుషోత్తం-భవానీ దంపతులు వ్యవహరించారు. ఈ రోజు సెలవుదినం కూడా కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయమును సందర్శించిన భక్తులకు సరిపడు ప్రసాదములు, మంచినీటి సౌకర్యం, క్యూలైన్లు తదితర ఏర్పాట్లు ధర్మకర్తలు శ్రీ తొనుపునూరి వీరన్న, శ్రీ గాదె శ్రవణకుమార్ రెడ్డి, శ్రీ ఓరుగంటి పూర్ణచందర్, శ్రీమతి గాండ్ల స్రవంతి, శ్రీ బింగి సతీష్ తదితరులు పర్యవేక్షించారు.

# గౌడల ఐక్యతతోనే సామాజిక అభివృద్ధి

## పొనకల్ గౌడ సంఘం ఆత్మీయ సన్మాన సభ




ఆదిలాబాద్, మార్చి 21 (పోలీస్ నిఘా) : సమాజంలో గౌడ కులస్తులు రాజకీయంగా, సామాజికంగా ఎదిగినప్పుడే సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలు నెరవేరుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం జన్నారం మండల కేంద్రంలోని మార్కెట్ హాల్‌లో పొనకల్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు మరియు ప్రెస్ క్లబ్ సభ్యులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులకు మరియు జర్నలిస్టులకు నీరాజనంఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ మరియు వార్డు సభ్యులుగా గెలుపొందిన గౌడ కులస్తులను, అలాగే ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో ఎన్నికైన ప్రతినిధులను ఈ సందర్భంగా సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

సన్మానం పొందిన వారు:పంజాల సురేష్ గౌడ్ (చింతలపల్లె సర్పంచ్)గాజుల లింగన్న గౌడ్ (జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు)అమరగొండ సతీష్ గౌడ్ (ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు)

వార్డు సభ్యులు: పోడేటి మల్లేష్ గౌడ్ (కవ్వాల్), నాయిని రమేష్ గౌడ్ (బాదంపెల్లి), బుర్రగడ్డ జగన్ గౌడ్ (చింతలపల్లి), నాయిని భూమా గౌడ్ (కలమడుగు).పాపన్న ఆశయ సాధనే లక్ష్యంఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మొకుదెబ్బ జిల్లా నాయకులు బాలసాని శ్రీనివాస్ గౌడ్, ఎన్నారై సెల్ అంతర్జాతీయ అధ్యక్షులు ఎరుకల రాజుగౌడ్ మాట్లాడుతూ.. ఇలాంటి ఆత్మీయ కలయికలు బహుజన వర్గాల్లో ఉత్తేజాన్ని నింపుతాయని అన్నారు. గౌడ వృత్తిదారులు కేవలం కులవృత్తికే పరిమితం కాకుండా, రాజకీయ అధికారం వైపు అడుగులు వేయడం శుభపరిణామమని కొనియాడారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజలకు అందుబాటులో ఉంటూ, కుల గౌరవాన్ని పెంపొందించేలా పనిచేయాలని ఆకాంక్షిం చారు. పాల్గన్న ముఖ్య నాయకులుపొనకల్ గౌడ సంఘం అధ్యక్షులు పోడేటి సతీష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మండల అధ్యక్షులు మూల భాస్కర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు వోల్లాల నర్సాగౌడ్.సంఘం నాయకులు పోడేటి నరేష్ గౌడ్, రాసమల్ల ప్రశాంత్ గౌడ్, గర్రెపల్లి శంకర్ గౌడ్, ఏనుగంటి సతీష్ గౌడ్, అంజా గౌడ్, గొల్లపల్లి చంద్రమౌళి గౌడ్ తదితరులు పాల్గన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండలంలోని వివిధ గ్రామాల నుండి గౌడ కులస్తులు భారీ సంఖ్యలో పాల్గని, ఎన్నికైన ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ముగిసిన 'ఖాకీ' బతుకు చిత్రం

### ఆ ఇద్దరు చిన్నారుల తలరాతను మార్చేసిన కాలం!



ఆదిలాబాద్, మార్చి 21 (పోలీస్ నిఘా) : శాంతిభద్రతలను కాపాడాల్సిన ఆ చేతులు.. సొంత జీవితంలోని కల్లోలాన్ని ఆపలేకపోయాయి. నేరగాళ్లను గడగడలాడించే ఆ గొంతు.. భార్య మరణంతో కలిగిన ఆవేదనను తట్టుకోలేక మూగబోయింది. కరీంనగర్ టూ టౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్య కేవలం ఒక మరణం కాదు.. ఒక నిండు కుటుంబం చిన్నాభిన్నమైన విషాద కావ్యం.

**అనుమానాల సుడిగుండంలో.. ఆవేదనల లోయలో..**

జీవిత భాగస్వామి దివ్య ఆత్మహత్యతో మొదలైన ఈ విషాదం, చంద్రశేఖర్‌ను మానసికంగా కోలుకోలేని దెబ్బ తీసింది.

మరకపడ్డ గౌరవం: దివ్య అంత్యక్రియల వేళ గ్రామస్థుల దాడి ప్రయత్నం ఆయనను తీవ్ర అవమానానికి గురిచేసింది. ఒక పోలీస్ అధికారిగా సమాజంలో ఉన్న గౌరవం, సొంత మనుషుల మధ్యే ప్రశ్నార్థకం కావడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు.

కదిలించిన నిందలు: భార్య మృతిపై తలెత్తిన అనుమానాలు, ఎదురైన ఆరోపణలు ఆయనను 'దోషి'గా చిత్రీకరించే ప్రయత్నం చేశాయి. ఈ మానసిక ఒత్తిడి ఆయన్ని ఒంటరిని చేసింది.

**సీతంపేటలో ఆఖరి శ్వాస..**

తన అత్తగారి ఇల్లైన ఇల్లందకుంట మండలం సీతంపేటలోనే చంద్రశేఖర్ తన జీవితాన్ని ముగించాలని నిర్ణయించుకోవడం కలిచివేసే అంశం. భార్య జ్ఞాపకాలు వెంటాడుతుండగా, ఆమె లేని లోకంలో ఉండలేక ఆయన ఉరితాడును ఆశ్రయించారు. తన భార్య ఎక్కడైతే కన్నుమూసిందో, దాదాపు అదే వేదనతో ఆయన కూడా నిష్క్రమించారు.

**ప్రశ్నార్థకమైన చిన్నారుల భవిష్యత్తు!**

ఈ కథలో అత్యంత హృదయ విదారకమైన దృశ్యం ఆ ఇద్దరు చిన్నారులు. అమ్మ లేదు.. నాన్న రారు: నిన్నటి వరకు అమ్మ ఒడిలో ఆడుకున్న ఆ పిల్లలకు, నేడు అమ్మ లేదన్న చేదు నిజం ఇంకా అర్థం కాలేదు. ఇంతలోనే నాన్న కూడా శాశ్వతంగా దూరమయ్యారని తెలిస్తే ఆ పసి హృదయాలు ఎలా తట్టుకుంటాయి?

అనాథలైన పసిమొగ్గలు: తల్లిదండ్రుల మధ్య గొడవలు ఏవైనా కావచ్చు, కానీ శిక్ష మాత్రం ఆ చిన్నారులకు పడింది. ఆ పసివాళ్లు ఇప్పుడు అనాథలుగా మిగిలిపోయారు. వారిని అక్కున చేర్చుకునేదెవరు? వారి భవిష్యత్తుకు భరోసా ఇచ్చేదెవరు?

కరీంనగర్ పోలీస్ శాఖలో ఒక విషాద ఛాయలు అలముకున్నాయి. ఒక అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తి, తన వ్యక్తిగత జీవితంలోని తుపానును తట్టుకోలేక తలవంచడం అందరినీ ఆలోచింపజేస్తోంది.

ఆలోచించండి: ఆవేశం ఆయుష్షును హరిస్తుంది. ఒక్క క్షణం ఓపిక పట్టి ఉంటే.. ఆ ఇద్దరు పిల్లలకు కనీసం తండ్రి నీడైనా మిగిలేది.

# పత్తి చేనులో పసికందు

### కనికరం లేని కన్నవారు.. గాలిస్తున్న పోలీసులు!



ఆదిలాబాద్, మార్చి 21 (పోలీస్ నిఘా) : కన్నపేగు ఏమైందో ఏమో కానీ, అప్పుడే పుట్టిన పసిగుడ్డును గాలికి వదిలేశారు కొందరు నిర్దయులు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో శనివారం చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

**అసలేం జరిగిందంటే?**

సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోని కాగజ్ నగర్ మండలం, వల్లగొండ గ్రామపంచాయతీకి చెందిన సీతానగర్ శివారులో ఉన్న ఒక పత్తి చేనులో గుడ్డలో చుట్టి ఉన్న ఓ మూటను స్థానిక రైతులు గమనించారు. ఆ మూటలో నుంచి చిన్నపాటి శబ్దం రావడంతో అనుమానం వచ్చి పరిశీలించగా, అందులో పసికందు కనిపించింది. వెంటనే అప్రమత్తమైన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు.

**సురక్షితంగా చిన్నారి..**

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పసికందును సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం. మెరుగైన వైద్యం మరియు తదుపరి సంరక్షణ కోసం శిశువును శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) అధికారులకు అప్పగించనున్నట్లు తెలుస్తోంది.

**పోలీసుల దర్యాప్తు వేగవంతం**

ఈ అమానవీయ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శిశువును వదిలివెళ్లిన గుర్తుతెలియని వ్యక్తుల కోసం పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నారు. గత కొన్ని రోజులుగా స్థానిక ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవించిన వారి వివరాలను సేకరిస్తున్నారు. గ్రామ శివారుకు వచ్చే దారుల్లో ఉన్న కెమెరాలను పరిశీలిస్తున్నారు.

చీకటి పడకముందే పసికందును గుర్తించడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని, లేదంటే అడవి జంతువుల బారిన పడే అవకాశం ఉండేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రెండు సెంట్రల్ గవర్నమెంట్ జాబ్స్ సాధించిన నేరడుగొమ్ము యువకుడు జెల్ల ప్రశాంత్



దేవరకొండ , మార్చి 21 (పోలీస్ నిఘా) : నేరడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన జెల్ల వెంకన్న గౌడ్, అంకులమ్మ ల పెద్ద కుమారుడు జెల్ల ప్రశాంత్ ఇటీవల విడుదలైన ఫలితాలలో రెండు సెంట్రల్ గవర్నమెంట్ జాబ్స్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఇంజనీరింగ్ జాబ్ సంపాదించాడు. ఈ జాబ్ లు సంపాదించినందుకుగాను కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రశాంత్ విద్యార్హత ఎంటెక్. వృత్తిరీత్యా తల్లిదండ్రులు రైతు కుటుంబం. రైతు కుటుంబం నుండి వచ్చిన తను తండ్రి కష్టాన్ని చూసిన వ్యక్తిగా వాళ్లకు మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చే విధంగా చదివి మంచి జాబ్ సాధించినందుకు తల్లిదండ్రులుగా వాళ్ళు పడ్డ కష్టానికి ఫలితం దక్కినందుకు సంతోషపడ్డారు. మొదటి నుండి చదువులో చురుకుగా ఉండే వాడని అన్నారు. ఈ యువకున్ని ఆదర్శంగా తీసుకొని గ్రామంలోని చదువుకున్న యువత తమ లక్ష్యాలను చేరుకోవాలని మేధావులు ఆకాంక్షించారు. తలవంచి నన్ను చదువు నిన్ను సమాజంలో తల ఎత్తుకొనేలా చేస్తా అని పుస్తకం చెబుతుంది. ఇంతటి విజయాన్ని సాధించిన ప్రశాంత్ కు అందరు అభినందనలు తెలిపారు.

## ఎస్సీల సంక్షేమం కోసం మార్చి 30న ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్ష

### చందంపేటలో పోస్టర్ ఆవిష్కరించిన ఎం.ఆర్.పి.ఎస్ (టి) నాయకులు



దేవరకొండ , మార్చి 21 (పోలీస్ నిఘా) : చందంపేట మండల కేంద్రంలో ఎం.ఆర్.పి.ఎస్ (టి) ఆధ్వర్యంలో మార్చి 30న నిర్వహించనున్న నిరాహార దీక్షకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం మండల అధ్యక్షులు కొండ్రపల్లి నాగేష్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ గారి ఆదేశాల మేరకు ఎస్సీల సంక్షేమ పథకాల సాధనకై ఈ నిరాహార దీక్షను ఇందిరా పార్క్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు రామాంజి సైదులు మాదిగ హాజరై మాట్లాడుతూ...మార్చి 30న ఇందిరా పార్క్‌లో జరిగే నిరాహార దీక్షకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆరెకంటి ఏసయ్య మాదిగ, కొండేటి మధు మాదిగ, ఎం.ఎస్.ఎఫ్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ్రపల్లి నాగేష్ మాదిగ, ఎం.ఇ.ఎఫ్ మండల నాయకులు కొండ్రపల్లి చంద్రశేఖర్, మంద రామస్వామి, కొండ్రపల్లి సురేష్, అన్నేపాక శ్రీను, అందుగుల చంటి, పగిడిమర్రి రవి, మాతంగి ఆనందం, కొండ్రపల్లి దాసయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ

### భద్రకాళి దేవాలయ మాడవీధుల అభివృద్ధికి నష్టపోయిన బాధితులకు ఇండ్లు కేటాయించిన ప్రభుత్వం



వరంగల్, మార్చి 21 (పోలీస్ నిఘా) : అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమణి. అభివృద్ధి కార్యక్రమాల వల్ల నష్టపోయే ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,కలెక్టర్ చాహత్ బాజ్పాయి, అన్నారు. శనివారం హనుమకొండలోని కూడా కార్యాలయంలో భద్రఖాళీ ఆలయ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మాడ వీధుల నిర్మాణం కారణంగా ఇళ్లను కోల్పోతున్న భూ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనగల వెంకట్రాం రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి ఎమ్మెల్యే డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలను అందజేశారు. భద్రఖాళీ ఆలయ అభివృద్ధి అనేది చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన అంశమని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వెంటనే నిధులు కేటాయించి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మాడ వీధుల నిర్మాణం చేపట్టడంతో కొన్ని కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోతున్న నేపథ్యంలో 17 కుటుంబాల వారికి డబుల్ బెడ్రూం లు కేటాయించి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు.

## ఈద్గాలను సందర్శించి పోలీస్ కమిషనర్



వరంగల్, మార్చి 21 (పోలీస్ నిఘా) : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం హన్మకొండ లోని బొక్కల గడ్డ, పోతన నగర్ ఈద్గాలను ను సందర్శించి రంజాన్ ప్రార్ధనలను సజావుగా జరిగేందుకు పోలీస్ అధికారుల చేపట్టిన భద్రత ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ స్థానిక ఏ.ఎస్పీ శుభం,ఏసీపీ నర్సింహా రావు, ఇన్స్పెక్టర్ ఇతర పోలీస్ అధికారులతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

# విజ్ఞాన్ సూపర్ 30 క్యాంపస్‌లో ఘనంగా విజయోత్సవ సభ




ఆదిలాబాద్, మార్చి 21 (పోలీస్ నిఘా) : జన్నారంలోని విజ్ఞాన్ సూపర్ 30 క్యాంపస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచారు. 2026–27 విద్యా సంవత్సరానికి గానూ ఆరవ తరగతి ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, శనివారం ఉదయం 11 గంటలకు క్యాంపస్ ఆవరణలో విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొనకల్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ మొదటి సంవత్సరంలోనే ఉత్తమ ఫలితాలు సాధించిన సంస్థ డైరెక్టర్ రంజిత్ కృషితో పాటు, అండగా నిలిచిన తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో జన్నారం ప్రాంత విద్యాభివృద్ధిలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించాలని వారు ఆకాంక్షించారు. సంస్థ డైరెక్టర్ రంజిత్ మాట్లాడుతూ.. విద్యార్థుల విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, విద్యార్థులకు పరిపూర్ణ జ్ఞానాన్ని అందించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తొలి ప్రయత్నంలోనే ఆశించిన ఫలితాలు రావడం తనలో మరింత ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. తమపై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ కాలంలో రంజిత్ అందించిన ప్రోత్సాహం, బోధనా పద్ధతులు తమ పిల్లల విజయానికి బాటలు వేశాయని విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. అనంతరం విజేతలకు, వారి తల్లిదండ్రులకు ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఈద్గా ప్రార్థనల్లో పాల్గొన్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధ వరెడ్డి



చెన్నారావుపేట, మార్చి 21 (పోలీస్ నిఘా) : నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డు శివారు లోనీ ఈద్గా నందు.ముస్లిం మత పెద్దలుఆహ్వానంవరకుపవిత్రమైన రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్క రించుకొని నర్సంపేట శాసనస భ్యులు దొంతి మాధవ రెడ్డి ముస్లిం సోదరుల తో కలిసి ప్రత్యే క ప్రార్థనలో పాల్గొనడం జరిగింది.. ఈ సంద ర్భంగా వారు మాట్లా డుతూ. రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవడా నికి,మంచి మార్గంలో నడవడానికి దోహద పడతాయని అన్నారు. మైనార్టీల సామాజి క,ఆర్థిక,విద్యా అభ్యు న్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని యువతకు ఉపాధి అవకాశాలు కల్పి స్తున్నామని అన్నారు. కులమతాలకు అతీ తంగా,నిరుపేద ముస్లింలకు అత్యధిక ఇంద్రమ్మ ఇండ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు.ముస్లిం సోద రులు చేసే ప్రతి ప్రార్థ నకు అల్లాహ్ ఆశీస్సులు లభించి, అందరి జీవితాల్లో ఆనందం,శాంతి,ఆరోగ్యం,ఐశ్వర్యం నిండాలని వారు ఆకాంక్షించారు.అనంతరం ఈద్గా నందు 50 లక్షల రూపా యలు వ్యయం తో నిర్మించబ డిన సిసి రోడ్డు ఁ సిసి ఫ్లాట్ ఫామ్ పనులకు సంబం ధించిన శిలా ఫలకాన్ని వారు ప్రారంభోత్సవం చేయడం జరిగింది.

ఈకార్యక్రమంలో ము న్సిపల్ చైర్ పర్సన్, మార్కెట్ కమిటీ చైర్మన్,మున్సిపల్ వైస్ చైర్మన్,పట్టణ పార్టీ అధ్యక్షులు,మున్సిపల్ కౌన్సిలర్స్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ అనుబంధ సంఘ నాయకురాలు,యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణు లు తదితరులు పాల్గొన్నారు..

# గొర్ల కాపరుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలి

## -జీఎంపీఎస్ జిల్లా మద్దెపురం రాజు-



యాదగిరిగుట్ట , మార్చి 21 (పోలీస్ నిఘా) : గొర్రెల మేకల పెంపకందారుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్యను జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు కోరారు.శనివారం గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను యాదగిరిగుట్టలోని ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే బిసి సంక్షేమానికి యేటా బడ్జెటులో రూ.25 వేల కోట్ల రూపాయలు కేటాయిస్తామని,ప్రతి గొల్ల కురుమ కుటుంబానికి రెండు లక్షల రూపాయలు నగదు బదిలీ చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.గొర్రెల పెంపకందారుల ప్రధాన సమస్యలైన నగదు బదిలీ,గొర్రెల భీమా,గొర్రెల కాపరులకు రూ.10లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా,50సం.లకు రూ.5000 పింఛన్లు,సొసైటీలకు కొత్త జిల్లాల ప్రాతిపదికన యూనియన్లు ఏర్పాటు మొదలైన వృత్తి సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యేలు మాట్లాడాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 25 నెలలు దాటినా ఇచ్చిన హామీలకు అనుగుణంగా బడ్జెటులో నిధులు కేటాయించడం లేదన్నారు.గొర్రెల పెంపకందారుల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని,గత ప్రభుత్వం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకాన్ని అవినీతి సాకుతో నిలిపివేసిందని విమర్శించారు.పశుసంవర్ధక,పాడి పరిశ్రమ,మత్స్య శాఖకు కలిపి 2024–25లో 1980 కోట్లు,2025–2026లో 1674 కోట్లు, 2026–27 బడ్జెట్లో 1529 కోట్లు వరుసగా ప్రభుత్వం మూడు బడ్జెటులలో కేటాయింపులు తగ్గిస్తున్నారని వివరించారు. రోగాలు, కుక్కల దాడులు ప్రమాదాలలో చనిపోయిన గొర్రెలకు నష్టపరిహారం ఇవ్వాలని,జీవాలకు సబ్సిడీ ద్వారా గడ్డి విత్తనాలు,దాణా పంపిణీ చేయాలని,పశు వైద్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ప్రతి గ్రామంలో సామూహిక గొర్రెల షెడ్లు,నీటి తొట్లు నిర్మించాలన్నారు.గొర్రెల కాపర్లపై అటవీ అధికారుల వేధింపులు అరికట్టాలని కోరారు.ప్రమాదాలలో చనిపోతున్న గొర్రెల కాపరులకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి దయ్యాల నర్సింహ్మా,ఉపాధ్యక్షులు బుడుమ శ్రీశైలం,సహాయ కార్యదర్శులు కొండే శ్రీశైలం,ఎల్లంల సత్యనారాయణ,జిల్లా కమిటీ సభ్యులు నారి వెంకటేష్,మన్నెబోయిన రాజ లింగం,పాక జహంగీర్,కడెం బీరప్ప,జోగు శ్రీనివాస్,ఎర్రోళ్ల ఉపేందర్,లెంకల యాదయ్య,మేడబోయిన యాదగిరి,బీమగోని జంగయ్య,మన్నెబోయిన మల్లయ్య,అవిశెట్టి పాండు పాల్గొన్నారు.

# రంజాన్ వేడుకలలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ





వరంగల్, మార్చి 21 (పోలీస్ నిఘా) : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ గారు పాల్గొన్నారు. మట్టేవాడ, ఎల్బీ నగర్, ఖిలా వరంగల్, ఈద్గాల్లో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ గారు ముస్లిం సోదర, సోదరీమణులను ఉద్దేశించి ప్రసంగించారు. పవిత్ర రంజాన్ మాసంలో నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించి, ఆధ్యాత్మికతతో పండుగ జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికీ ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించినట్లు చెప్పారు.

అభివృద్ధి & సంక్షేమ కార్యక్రమాలు...

మట్టేవాడ ఈద్గా అభివృద్ధికి రూ.1 కోటి ఖిలా వరంగల్ ఈద్గా అభివృద్ధికి రూ. కోటి ఎల్బీ నగర్ ఈద్గా అభివృద్ధికి రూ. 60 లక్షలు చింతల్ ఈద్గా అభివృద్ధికి రూ.40 లక్షలు

అలాగే ముస్లిం సోదరుల సంక్షేమార్థం: 400 కుట్టు మిషన్ యంత్రాల పంపిణీ రంజాన్ తోఫా కింద 3,500 కిట్ల పంపిణీ

మత సామరస్యానికి ప్రతీకగా ఈ రంజాన్ వేడుకలు నిలుస్తాయని, సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తాయని మంత్రి కొండా సురేఖ గారు పేర్కొన్నారు

# అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**పర్యావరణ సంరక్షణపై కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపు**

**ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం**




హనుమకొండ, మార్చి 21 (పోలీస్ నిఘా) : తెలంగాణ ప్రభుత్వం అటవీ శాఖ, హనుమకొండ జిల్లా, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని కాకతీయ జూలాజికల్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం భాగంగా జిల్లా అటవీ శాఖాధికారి బి. లావణ్య, ఫారెస్ట్ కాంప్లెక్స్, సుబేదారి నుంచి కాకతీయ జూలాజికల్ పార్క్ వరకు నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పర్యావరణ పరిరక్షణపై ప్రాధాన్యతను వివరించారు. అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దాని కోసం అడవులకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మట్టి పాత్రల్లో నీరు, ఆహారం ఉంచడం ద్వారా పక్షులు, జీవజాలానికి సహాయపడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్ బి. మయూరి, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యులు ఇందారం నాగేశ్వర్ రావు, చెలుపూరి శ్యామ్ సుందర్, పిట్టల రవి బాబు, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ తిప్పని రాధిక, జిల్లా అటవీ శాఖ సిబ్బంది, జూ పార్క్ సెక్షన్ ఆఫీసర్లు సురిదాస్, శివ కుమార్, బీట్ ఆఫీసర్లు శారద, శ్వేత, సురేష్ పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్పూర్తితో దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి

**ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన వాలీబాల్ టోర్నమెంట్**




యాదగిరిగుట్ట, మార్చి 21 (పోలీస్ నిఘా) : భగత్ సింగ్ స్పూర్తితో దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యులు బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట గ్రౌండ్స్ లో 21నుండి 23వరకు నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ మొదటి రోజు ప్రారంభోత్సవానికి బీర్ల ఐలయ్య, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, కల్లూరు ధర్మేంద్ర లు ముఖ్య అతిధిలుగా హాజరై, క్రీడాకారులతో కరచాలనం చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరయోధుడు అమర వీరుడు భగత్ సింగ్ ఆశయాలను స్పూర్తిగా తీసుకుని నిర్వహిస్తున్న వాలీ బాల్ టోర్నమెంట్ సందర్భంగా యువత దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. భగత్ సింగ్ యువతకు ధైర్యం, త్యాగం, దేశభక్తి యొక్క ప్రతీక అని,ఆయన చూపిన మార్గం మనకు నేటికీ ప్రేరణ అని అన్నారు. నేటి యువత క్రీడల ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలన్నారు. భారతదేశ అభివృద్ధిలో యువతే ప్రధాన శక్తి అని, యువత సృజనాత్మక శక్తిని దేశ నిర్మాణానికి వినియోగించాలన్నారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ మరియు మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందన్నారు. ఇది కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదని , దేశ భవిష్యత్తుకు కూడా ప్రమాదకరమన్నారు. అందువల్ల యువత ఈ మాదకద్రవ్యాల బారిన పడకుండా దూరంగా ఉండాలన్నారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, పోరాటస్పూర్తిని పెంచుతాయని . భగత్ సింగ్ ఆశయాలకు అనుగుణంగా యువత సామాజిక చైతన్యంతో ముందుకు రావాలన్నారు. నిరుద్యోగం, అన్యాయం, అవినీతి, మాదకద్రవ్యాల వంటి సామాజిక సమస్యలపై పోరాడే శక్తిగా యువత ఎదగాలన్నారు.ఈ క్రికెట్ టోర్నమెంట్ కేవలం క్రీడా కార్యక్రమం మాత్రమే కాదని, యువతను చైతన్యపరిచే ఒక ఉద్యమన్నారు. కాబట్టి ప్రతి యువకుడు క్రీడలను ప్రోత్సహిస్తూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, సీపీఐ యాదాద్రి జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, సీపీఐ మండల కార్యదర్శి కళ్లేపల్లి మహేందర్,సీపీఐ పార్టీ పట్టణ కార్యదర్శి, కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్,7వ వార్డు కౌన్సిలర్ పెల్లిమల్లి లావణ్య శ్రీధర్, పేరబోయిన బంగారి, గోరేటి రాములు, పేరబోయిన పెంటయ్య , గాదెగాని మాణిక్యం, సీపీఐ మోటకొండూర్ మండల కార్యదర్శి, అనంతుల నరసింహ , ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, ఎర్ర అశోక్, తోటకూర శేఖర్, కంబాల నరసింహ, మహేష్ మరియు 16 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

# రంజాన్ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు అయూబ్ మహమ్మద్‌కి శుభాకాంక్షల వెల్లువ



వరంగల్, మార్చి 21 (పోలీస్ నిఘా) : పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ డీసీసీ అధ్యక్షులు శ్రీ అయూబ్ మహమ్మద్ గారిని వారి నివాసంలో పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కే.ఆర్. నాగరాజు గారు, పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి గారు, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య గారు ,స్థానిక సీనియర్ కాంగ్రెస్ నేతలు అయూబ్ గారి ఆహ్వానం మేరకు వారి నివాసానికి విచ్చేసి డీసీసీ అధ్యక్షులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి సేవ చేయాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు,నాయకులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు,కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.




# వేసవిలో పిల్లలతో జాగ్రత్త!

## చెమటకాయల టార్చర్, ఎర్రటి పొక్కులు, దురదకు చెక్ పెట్టే చిట్కాలు



వేసవి కాలం వచ్చిందంటే చాలు.. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుంటాడు. ఈ మండే ఎండల్లో ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు ఉక్కపోత కూడా విపరీతంగా ఉంటుంది. ఈ సమయంలో పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరినీ వేధించే ప్రధాన సమస్య 'చెమటకాయలు'.

ఇవి చూడటానికి చిన్న ఎర్రటి పొక్కుల్లా ఉన్నా, వీటి వల్ల కలిగే దురద, మంట మాత్రం అంతా ఇంతా కాదు. ముఖ్యంగా సున్నితమైన చర్మం ఉండే పిల్లలు ఈ సమస్యతో తీవ్రమైన అసౌకర్యానికి గురవుతుంటారు. అసలు ఈ చెమటకాయలు ఎందుకు వస్తాయి? వీటిని తగ్గించుకునే మార్గాలు ఏంటో వివరంగా తెలుసుకుందాం. పెద్దలతో పోలిస్తే పిల్లలకు ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. వారి చర్మం చాలా సున్నితంగా ఉండటం వల్ల చెమటకాయలు వచ్చినప్పుడు విపరీతమైన మంటతో ఏడుస్తుంటారు. దీనివల్ల వారికి నిద్ర కూడా సరిగ్గా పట్టదు. ముఖ్యంగా మోకాళ్ల వెనుక, మోచేతుల లోపల ఇవి ఎక్కువగా బాధిస్తాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

దుస్తుల ఎంపిక– వేసవిలో బిగుతుగా ఉండే సింథటిక్ దుస్తులకు దూరంగా ఉండాలి. కేవలం వదులుగా ఉండే కాటన్ దుస్తులనే ధరించండి. ఇవి చెమటను పీల్చుకుని చర్మానికి గాలి తగిలేలా చేస్తాయి.

పరిశుభ్రత– రోజుకు రెండుసార్లు చల్లటి నీటితో స్నానం చేయాలి. బయటి నుంచి రాగానే చెమట పట్టిన ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలి. స్నానం తర్వాత చర్మాన్ని రుద్దకుండా మెత్తని టవల్‌తో అద్దినట్లు తుడుచుకోవాలి.

హైడ్రేషన్– నీరు ఎక్కువగా తాగడం వల్ల శరీరం లోపలి నుంచి చల్లబడుతుంది. రోజుకు కనీసం 3-4 లీటర్ల నీరు తాగడం వల్ల చర్మ సంబంధిత వ్యాధులు దూరమవుతాయి.

చల్లదనంలో ఉండటం– వీలైనంత వరకు ఎండలో తిరగకుండా, ఫ్యాన్ లేదా ఏసీ ఉన్న గదుల్లో ఉండటానికి ప్రయత్నించాలి. చర్మాన్ని ఎప్పుడూ పొడిగా ఉంచుకోవాలి.

**ఇంటి చిట్కాలతో ఉపశమనం..**

కాలమైన్ లోషన్ : దురదను తగ్గించడంలో ఇది చాలా అద్భుతంగా పనిచేస్తుంది.

కలబంద : కలబంద జెల్ రాయడం వల్ల చర్మం చల్లబడి మంట తగ్గుతుంది.

ఐస్ ప్యాక్ : పొక్కులు ఎక్కువగా ఉన్న చోట ఐస్ ముక్కలతో మెల్లగా రుద్దితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.

గంధపు పేస్ట్ : మంచి గంధం పేస్ట్‌ను పూయడం ద్వారా చర్మంపై దురద తగ్గి చల్లదనం లభిస్తుంది.

కీరదోస : ప్రభావిత ప్రాంతాల్లో కీరదోస ముక్కలను ఉంచడం కూడా మంచి ఫలితాన్ని ఇస్తుంది.

సాధారణంగా ఇవి 2-3 రోజుల్లో తగ్గిపోతాయి. ఒకవేళ పొక్కుల నుంచి చీము రావడం, జ్వరం రావడం లేదా వారం దాటినా తగ్గకపోతే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. చెమటకాయలు అనేవి చిన్న సమస్యే అయినా, సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే అవి ఇన్ఫెక్షన్లుగా మారే అవకాశం ఉంది. పైన చెప్పిన చిట్కాలు పాటిస్తూ ఈ వేసవిలో మీ చర్మాన్ని పదిలంగా కాపాడుకోండి!

# ఏ టైంకి డ్రై ఫ్రూట్స్ తింటే ఎక్కువ ప్రయోజనం?



మన ఆరోగ్యానికి డ్రై ఫ్రూట్స్ ఎంతో మేలు చేస్తాయి. అందుకే వీటిని చాలా మంది తమ ఆహారంలో చేర్చుకుంటారు. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. డ్రై ఫ్రూట్స్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. అలాగే రోజంతా శరీరానికి అవసరమైన శక్తిని కూడా అందిస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్‌ను ఎప్పుడు తింటామన్నది కూడా చాలా ముఖ్యం. సరైన సమయంలో తింటే వాటిలోని పోషకాలను శరీరం మరింత సమర్థవంతంగా గ్రహిస్తుంది. పోషకాహార నిపుణురాలు రిచా దోషి తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో డ్రై ఫ్రూట్స్‌ను సరైన సమయంలో తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఎలా పెరుగుతాయో వివరించారు.

**డ్రై ఫ్రూట్స్ తినడానికి సరైన సమయం**

బాదం: బాదం తినడానికి ఉత్తమ సమయం ఉదయం. ఖాళీ కడుపుతో వీటిని తీసుకుంటే ఎంతో మేలు చేస్తాయన్నారు. ముఖ్యంగా రాత్రంతా నీటిలో నానబెట్టిన బాదం తింటే మెరుగైన ఫలితాలు పొందవచ్చు. ఇవి శరీర జీవక్రియను వేగవంతం చేయడంతో పాటు రోజంతా స్థిరమైన శక్తిని అందిస్తాయి. అలాగే దృష్టి కేంద్రీకరణను కూడా మెరుగుపరుస్తాయి.

వాల్‌నట్స్: వాల్‌నట్స్‌ను సాయంత్రం సమయంలో తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, మెలటోనిన్ ఉండటం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. అలాగే శరీరానికి విశ్రాంతిని కలిగించి నిద్ర నాణ్యతను కూడా మెరుగుపరుస్తాయి.

జీడిపప్పు: జీడిపప్పును మధ్యాహ్నం స్నాక్‌గా తీసుకోవడం ఉత్తమం. వీటిలో మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి స్థిరమైన శక్తిని అందిస్తాయి. అయితే రాత్రి సమయంలో వీటిని తినడం మంచిది కాదు, ఎందుకంటే ఎక్కువ కొవ్వు, ప్రోటీన్ ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది.

పిస్తా పప్పులు: పిస్తాపప్పులు రోజులో ఎప్పుడైనా తినవచ్చు కానీ ఎక్కువగా మధ్యాహ్నం లేదా సాయంత్రం సమయంలో స్నాక్‌గా తీసుకోవడం మంచిది. వీటిలో ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. శరీరానికి అవసరమైన శక్తి అందుతుంది.

**ప్రయోజనాలు**

శక్తి స్థాయిలు పెరుగుతాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అనవసరమైన ఆకలి తగ్గుతుంది. నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. రోజంతా సమతుల్యమైన ఆహారపు అలవాట్లు ఏర్పడతాయి.

మొత్తానికి ఆరోగ్యకరమైన ఆహారం అంటే కేవలం ఏమి తింటామనే విషయమే కాదు, దాన్ని ఎప్పుడు, ఎలా తింటామన్నదీ అంతే ముఖ్యమైనది. చిన్న చిన్న మార్పులు చేస్తే మన శరీరం ఆరోగ్యంగా ఉండటంలో పెద్ద మార్పు కనిపిస్తుంది.

# కొత్తిమీరే కదా అని తీసిపారేస్తున్నారా?



మనం ప్రతిరోజూ వంటల్లో రుచి కోసం, గార్నిషింగ్ కోసం కొత్తిమీరను ఉపయోగిస్తుంటాం. అయితే ఈ చిన్న ఆకుకూర కేవలం ఆహారానికి సువాసనను జోడించడమే కాకుండా శరీరానికి ఎంతో మేలు చేసే ఔషధ గుణాలను కలిగి ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కొత్తిమీరలో విటమిన్ ఏ, సి, కె తో పాటు శరీరానికి అవసరమైన ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా దీని గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉండటం వల్ల మైగ్రేన్లు, థైరాయిడ్, కొలెస్ట్రాల్ మరియు హార్మోన్ల అసమతుల్యత వంటి అనేక ఆరోగ్య సమస్యలకు ఇది దివ్యౌషధంగా పనిచేస్తుంది. డయాబెటిస్ లేదా రక్తంలో చక్కెర సమస్య ఉన్నవారికి కొత్తిమీర ఒక గొప్ప వరమనే చెప్పాలి. ఇందులో ఉండే సహజ ఎంజైమ్‌లు రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గించడంలో చురుకైన పాత్ర పోషిస్తాయి. ఇందులోని ఫైబర్ ఆహారం నెమ్మదిగా జీర్ణం అయ్యేలా చేసి, చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా నియంత్రిస్తుంది. దీని కోసం కొత్తిమీర ఆకులను రాత్రిపూట నీటిలో నానబెట్టి, ఉదయం ఆ నీటిని తాగడం వల్ల శరీరానికి అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. అంతేకాకుండా ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్లు, ఇతర వ్యాధుల నుండి మనల్ని రక్షిస్తాయి. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో కూడా కొత్తిమీర కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కడుపులో గ్యాస్, అజీర్ణం, ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. శరీరం లోపల పిత్తం లేదా అసిడిటీ పెరిగినప్పుడు అది ముఖంపై మొటిమలు, మచ్చల రూపంలో కనిపిస్తుంది. కొత్తిమీర సహజంగా చలువ చేసే గుణం కలిగి ఉండటం వల్ల శరీరాన్ని లోపలి నుండి శుభ్రపరుస్తుంది. దీనివల్ల చర్మం కాంతివంతంగా మారడమే కాకుండా మొటిమలు కూడా తగ్గుతాయి. అలాగే ఇందులోని విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు జుట్టు కుదుళ్లను బలోపేతం చేసి జుట్టు రాలడాన్ని అరికడతాయి. గుండె ఆరోగ్యానికి కూడా కొత్తిమీర ఎంతో మేలు చేస్తుంది. ఇది శరీరంలోని అదనపు సోడియంను బయటకు పంపడం ద్వారా రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతుంది. క్రమం తప్పకుండా కొత్తిమీరను మితంగా తీసుకోవడం వల్ల గుండెపోటు ప్రమాదాన్ని కూడా తగ్గించవచ్చని కొన్ని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. రోజువారీ ఆహారంలో కొంత మొత్తంలో కొత్తిమీరను చేర్చుకోవడం ద్వారా కేవలం రుచిని మాత్రమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికులకు మొండిచేయి

**నిరసన వ్యక్తం చేసిన సంక్షేమ సమితి**



ఆదిలాబాద్, మార్చి 21 (పోలీస్ నిఘా) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఎలాంటి నిధులు కేటాయించకపోవడం పట్ల 'తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి' తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సమితి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కార్యవర్గ సభ్యులు బడ్జెట్‌ను తీవ్రంగా ఖండించారు.

**హామీలు ఏమయ్యాయి?**

**– వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య**

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేకంగా గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామని, సంక్షేమ నిధిని కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య, జన్నారం మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి గుర్తు చేశారు. 2024 ఏప్రిల్ 16న ముఖ్యమంత్రి గల్ఫ్ సంఘాల నేతలతో స్వయంగా సమావేశమై, త్వరలోనే పాలసీతో కూడిన గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చి, ఇప్పుడు బడ్జెట్‌లో విస్మరించడం గల్ఫ్ కుటుంబాలను వంచించడమేనని మండిపడ్డారు.

**ఎక్స్‌గ్రేషియా స్వాగతించినా.. పోరాటం తప్పదు**

గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని, అయితే ఇంకా అనేక బాధిత కుటుంబాలకు ఈ సాయం అందాల్సి ఉందని నాయకులు పేర్కొన్నారు. కేవలం ఎక్స్‌గ్రేషియాతోనే బాధ్యత తీరిపోదని, బ్రతికి ఉన్న కార్మికుల రక్షణ, ఉపాధి భద్రత కోసం బోర్డు ఏర్పాటు అనివార్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బడ్జెట్ నిర్ణయాలను పునఃపరిశీలించాలని వారు డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే, గల్ఫ్ ఏంఅతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎల్లయ్య, ఉపాధ్యక్షులు కొండూరు ప్రశాంత్, జన్నారం టౌన్ అధ్యక్షులు తాళ్లపల్లి రాజేష్, టౌన్ క్యాషియర్ మరిపెల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పండిట్ దీన్ దయాళ్ అడుగుజాడలు అనుసరణీయం

**భారతీయ ఆలోచనలకు ప్రముఖ స్తంభం పండిట్ దీన్ దయాళ్**

**బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**







వరంగల్ , మార్చి 21 (పోలీస్ నిఘా) : వరంగల్ జిల్లా గిర్మాజీపేట మండలం ఆధ్వర్యంలో 28వ డివిజన్ కార్పొరేటర్ గందే కల్పన గారి అధ్యక్షతన గుజరాత్ సమాజ్ భవన్లో నిర్వహించిన 'దీన్ దయాళ్ ప్రశిక్షణ అభియాన్'లో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో సమావేశమై, పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి ఆదర్శాలను, సిద్ధాంతాలను చర్చించి,. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నిరంతర అధ్యయనం సంస్థాగత క్రమశిక్షణ, మరియు సమర్థవంతమైన సమాచార మార్పిడి ఎంత కీలకమో కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడం జరిగింది. నిరంతర శ్రమ, సైద్ధాంతిక నిబద్ధతతోనే సంస్థాగత నిర్మాణం మరింత పటిష్టమవుతుందని, బిజెపి యొక్క ప్రధాన సైద్ధాంతిక పునాది పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం. ఇది కమ్యూనిజం, పెట్టుబడిదారీ విధానాలకు భిన్నంగా, మానవుడిని కేంద్రంగా ఉంచుకుని, వ్యక్తిగత మరియు సామాజిక శ్రేయస్సును, ఆధ్యాత్మికతను సమన్వయం చేసే స్వదేశీ ఆర్థిక, రాజకీయ నమూనా వంటి అంశాలపై కార్యకర్తలకు వివరించిన జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, ప్రశిక్షణ అభియాన్ అబ్జర్వర్ కనుకుంట్ల రంజిత్ కుమార్, జిల్లా నాయకులు కూచన క్రాంతి కుమార్, మాదాసు రాజు, మండల అధ్యక్షులు సీతా నాగరాజు, మండల నాయకులు రామిని సుమన్, జెట్లింగ్ శివ, కొత్తకొండ రాజేష్ మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన

# మల్టీ జోన్ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, మార్చి 21 (పోలీస్ నిఘా) : జిల్లాకు విచ్చేసిన మల్టీ జోన్ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డికి జిల్లా పోలీస్ అధికారులు పూల మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాలచే గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి,సర్కిల్ వారీగా శాంతి భద్రతల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు భద్రతాభావం కలిగేలా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ అధికారులు,సిబ్బంది చట్టాలపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని, నమోదు అయిన కేసులలో దర్యాప్తు నాణ్యతను మెరుగు పరుస్తూ ప్రజలకు వేగవంతమైన న్యాయం అందేలా పోలీస్ యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు.అన్ని పోలీస్ స్టేషన్లలో 5ఎస్ లో భాగంగా రికార్డుల నిర్వహణను సక్రమంగా ఉంచాలని,జిల్లాలో ప్రోయాక్టివ్, విజిబుల్, కమ్యూనిటీ పోలీసింగ్ పై దృష్టి సారించాలని,చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై నిఘాను కఠినతరం చేయాలని ఆదేశించారు. ఇంటి నుండి బయటకు వెళ్లిన ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరే లక్ష్యంతో చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు శ్రీనివాస్,నాగేశ్వరరావు, వెంకటేష్,వెంకటేశ్వర్లు,రవి, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి,సురేష్,పాల్గొన్నారు

# కార్మికులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన



రంగారెడ్డి, మార్చి 21 (పోలీస్ నిఘా) : రంగారెడ్డి జిల్లా, నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెట్టి కంపెనీని నందిగామ ఎస్.హెచ్.ఓ పి. ప్రసాద్ మరియు పోలీస్ సిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో వారికి నిత్య జీవితంలో ఎదురయ్యే పలు కీలక అంశాలపై చాలా సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు తెలియని వ్యక్తులకు ఫోన్ నంబర్లు, ఓటీపీలు అస్సలు చెప్పకూడదని సూచించారు. తక్కువ ధరకే వస్తువులు వస్తాయనే ఆశతో లేదా లాటరీ వచ్చిందనే మాటలతో మోసపోవద్దని తెలిపారు. ఒకవేళ ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపవద్దని, ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదని వివరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. మత్తులో నేరాలకు పాల్పడితే కఠినమైన జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.

పోక్సో చట్టం.. చిన్న పిల్లల పట్ల తప్పుగా ప్రవర్తించినా, లేదా వారిపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టం చాలా కఠినంగా ఉంటుందని వివరించారు. పిల్లల రక్షణ అనేది సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. ఏదైనా సమస్య ఎదురైనా లేదా అత్యవసర పరిస్థితుల్లో ఉన్నా వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించాలని లేదా డైల్ 100 / 112 కు సమాచారం అందించాలని కార్మికులకు సూచించారు.

## అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



తిరుమలగిరి, మార్చి 21 (పోలీస్ నిఘా) : తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సబ్ ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల కథనం ప్రకారం 16.03.2026 న 18:00 సుమారు గంటల సమయంలో మారుతి నగర్ నుండి భూదేవి నగర్ రోడ్డు వైపు వెళ్లే దారిలో గుర్తు తెలియని పురుషుడు మృతదేహం లభ్యమైంది మృత్యువు వివరాలు వయస్సు సుమారు 42- 45 సంవత్సరాలు కలిగి ఎత్తు 5.7 అడుగులు, నల్ల ప్యాంటు ధరించి, ఛాయా నల్లగా కలర్ కలిగి ఉన్నాడు అని గుర్తించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ముమ్మారం చేశారు.

## నాగవరంశివార్ ప్రాంతంలో కొత్తగా కేంద్రీయ విద్యాలయం



వనపర్తి, మార్చి 21 (పోలీస్ నిఘా) : వనపర్తి జిల్లా, నాగవరంశివార్ ప్రాంతంలో కొత్తగా కేంద్రీయ విద్యాలయం ప్రారంభించబడినది అని తెలియజేయడం ఆనందంగా ఉంది. ఈ విద్యాసంస్థలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి బాలవాటిక-1, బాలవాటిక-2, బాలవాటిక-3 తరగతులు మరియు 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయి.ప్రవేశాల వివరాలు:బాలవాటిక (1-3) మరియు 1వ తరగతి కోసం అభ్యర్థనలు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించబడతాయి.దరఖాస్తు 2వ, 3వ, 4వ మరియు 5వ తరగతులు కోసం ప్రవేశాలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించబడతాయి.ఆసక్తి గల తల్లిదండ్రులు/అభ్యర్థులు పాఠశాల తాత్కాలిక ప్రాంగణం (జుఋ భవనం), నాగవరంశివార్, వనపర్తి వద్ద పని దినాలలో సంప్రదించాలి.తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లలను కేంద్రీయ విద్యాలయంలో చేర్పించాలని కోరడమైనది.

## రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

### -సౌభ్రాతృత్వం, ఐక్యతకు పిలుపు-





యాదగిరిగుట్ట, మార్చి 21 (పోలీస్ నిఘా) : యాదగిరిగుట్ట, ఆలేరు పట్టణాల్లో ఘనంగా నిర్వహించిన రంజాన్ పర్వదిన వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతం మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడగా, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మాట్లాడిన ఆయన రంజాన్ పండుగ మనుషుల మధ్య ప్రేమ, సహనం, దయ, త్యాగం వంటి విలువలను పెంపొందించే గొప్ప పర్వదినమని పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సౌభ్రాతృత్వంతో జీవించడం ఎంతో ముఖ్యమని, ఈ పండుగ ఆ సందేశాన్ని అందరికీ తెలియజేస్తుందని అన్నారు.ప్రస్తుతం సమాజంలో శాంతి, సామరస్యం అత్యంత అవసరమని, అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని, మైనార్టీల అభివృద్ధికి ప్రత్యేక ప్రాఎంధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మతపెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిత్రం

## ఉస్తాద్, ధురంధర్.. ఊపిరి పోసినట్లే..



ఉగాది పండుగ సందర్భంగా ఉస్తాద్ భగత్ సింగ్, ధురంధర్: ది రివెంజ్ చిత్రాలు.. థియేటర్స్‌లో రిలీజ్ అయిన విషయం తెలిసిందే. అయితే ఆ రెండు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద కొత్త జోష్ తీసుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎందుకంటే ఫిబ్రవరి నెల అంతా బాక్సాఫీస్ వద్ద నిరాశే మిగిల్చింది. పెద్ద సినిమాలు లేకపోవడం, విడుదలైన చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడంతో థియేటర్లలో కలెక్షన్లు వీక్‌గా కనిపించాయి. 2026 సంక్రాంతి సందర్భంగా వచ్చిన సినిమాల ఎఫెక్ట్ తగ్గిన తర్వాత, టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద అనుకున్న స్థాయిలో సందడి కనిపించలేదు. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు కొత్త హిట్ కోసం ఎదురుచూస్తూ ఉండగా, మార్చి నెల ప్రారంభం కూడా పెద్దగా ఆశలు రేకెత్తించలేదు. అయితే ఆ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిన రెండు సినిమాలు ఉస్తాద్ భగత్ సింగ్, ధురంధర్ ది రివెంజ్. ఆ రెండు చిత్రాలు విడుదలైన తొలి రోజు సాలిడ్ వసూళ్లు సాధించాయి.. ముఖ్యంగా ఉస్తాద్ సినిమా తెలుగు రాష్ట్రాల్లో మొదటి రోజు రూ.37 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ధురంధర్ కూడా అన్ని భాషల్లో కలిపి తెలుగు రాష్ట్రాల్లో దాదాపు రూ.10 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టినట్లు సమాచారం. అలా రెండు సినిమాలు కూడా మంచి ఓపెనింగ్స్ అందుకున్నాయని చెప్పాలి. ఇప్పుడు ఆ రెండు సినిమాల విజయంతో ఫిబ్రవరి నెలలో నెలకొన్న బాక్సాఫీస్ నిరుత్సాహం ఒక్కసారిగా తొలగిపోయింది. ప్రేక్షకులు మళ్లీ థియేటర్లకు రావడం ప్రారంభించడంతో ఎగ్జిబిటర్లలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ముఖ్యంగా వీకెండ్ కలెక్షన్లు కూడా భారీగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే అడ్వాన్స్ బుకింగ్స్ ఫుల్ జోష్ లో జరుగుతున్నాయని వినికిడి. అయితే ఉస్తాద్ సినిమా విషయానికొస్తే.. ఇది కంప్లీట్ మాస్ ఎంటర్టైనర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని అర్థమవుతోంది. కథ, యాక్షన్ సన్నివేశాలు, సంగీతం.. సినిమాకు పాజిటివ్ ఎలిమెంట్స్ గా మారినట్లు తెలుస్తోంది. మరోవైపు ధురంధర్ 2 కూడా తన కథనం, ప్రెజెంటేష న్‌తో ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకుని దూసుకుపోతోంది. ఏదేమైనా సంక్రాంతి తర్వాత వచ్చిన గ్యాప్ ను ఆ రెండు సినిమాలు భర్తీ చేయడం విశేషం. సాధారణంగా ఇది పరీక్షల సమయం కాబట్టి.. సినిమాలకు కొంత కష్టమైనదిగా భావిస్తారు. కానీ సరైన కంటెంట్ ఉంటే ఎప్పుడైనా ప్రేక్షకులు థియేటర్లకు వస్తారనే విషయాన్ని ఉస్తాద్, ధురంధర్ ది రివెంజ్ నిరూపించాయి. మొత్తానికి, ఫిబ్రవరి నెలలో ఏర్పడిన నిరాశ పరిస్థితికి ముగింపు పలుకుతూ ఉస్తాద్ భగత్ సింగ్, ధురంధర్ సినిమాలు బాక్సాఫీస్ కు కొత్త ఊపిరి పోశాయని చెప్పాలి. మరి ఆ రెండు సినిమాలు ఎంతటి వసూళ్లు సాధిస్తాయో అంతా వేచి చూడాలి.

## దృశ్యం-3 ఏప్రిల్ నుంచి మేకు షిఫ్ట్?



మలయాళ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటైన దృశ్యం3 మరోసారి వార్తల్లో నిలిచింది. రిలీజ్ డేట్ పై నెలకొన్న కన్ఫ్యూజన్ ఇప్పుడు ట్రేడ్ వర్గాలు, అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. మొదటగా ఏప్రిల్ 2న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అయిన ఈ సినిమా ఇప్పుడు వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది. మోహన్ లాల్, మీనా కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. అయితే, రిలీజ్ డేట్ విషయంలో తీసుకోబోయే తుది నిర్ణయం పలు పరిస్థితులపై ఆధారపడి ఉండటం గమనార్హం. అందులో ముఖ్యంగా, కేరళలో జరగనున్న ఎన్నికలు ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా మారినట్లు సమాచారం. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో, ఆ ముందు వారంలో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రచారం ఉధృతంగా సాగనుంది. ఈ సమయంలో సినిమా ప్రమోషన్స్ నిర్వహించడం కష్ట సాధ్యమవుతుందని, ప్రేక్షకుల దృష్టి కూడా ఎక్కువగా రాజకీయాలపైనే ఉంటుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఫలితంగా, ఓపెనింగ్స్‌పై ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇక అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు కూడా నిర్మాతలను ఆలోచనలో పడేశాయని తెలుస్తోంది. ముఖ్యంగా గల్ఫ్ దేశాలు మలయాళ సినిమాలకు ప్రధాన ఆదాయ వనరుగా నిలుస్తున్నాయి. అయితే అక్కడ నెలకొన్న యుద్ధ వాతావరణం, భద్రతా ఆందోళనలు థియేట్రికల్ బిజినెస్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. గల్ఫ్ మార్కెట్‌లో దృశ్యం సిరీస్‌కు ఉన్న భారీ క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుంటే, ఈ అంశాన్ని లైట్ తీసుకోలేమని నిర్మాతలు భావిస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో, సినిమాను ఏప్రిల్ 2న రిలీజ్ చేయకుండా వాయిదా వేసి, మే మొదటి వారంలో కొత్త రిలీజ్ డేట్ రిలీజ్ డేట్ ను పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. ఈలోగా ఎన్నికల ప్రభావం తగ్గడంతో పాటూ, విదేశీ మార్కెట్ పరిస్థితులు కూడా కొంతవరకు స్థిరపడే అవకాశముందని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రమోషన్స్ విషయానికొస్తే, త్వరలో మొదలవాల్సిన ప్రమోషన్స్ ను కూడా ప్రస్తుతానికి హోల్డ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. సరైన టైమ్ చూసుకుని విస్తృతంగా ప్రమోషన్స్ నిర్వహించాలనే ఆలోచనలో చిత్ర బృందం ఉందని సమాచారం. మొత్తానికి, జార్జ్‌కుట్టి పాత్రను మరోసారి తెరపై చూడాలనే ఆసక్తితో ఉన్న అభిమానులు కొంత నిరాశ చెందుతున్నప్పటికీ, మంచి రిలీజ్ డేట్ ను సెలెక్ట్ చేసుకుని సినిమా భారీ విజయాన్ని అందుకోవడమే నిర్మాతల లక్ష్యంగా కనిపిస్తోంది. దీంతో అందరూ దృశ్యం3 రిలీజ్ డేట్ విషయంలో అధికారిక ప్రకటన కోసం ఇప్పుడు ఎదురుచూస్తున్నారు.

## 'హ్యాపీ రాజ్' అంటూ అబ్బాస్ రీఎంట్రీ




90స్‌లో తన స్టైల్ అండ్ స్మైల్‌తో ప్రేక్షకులను అలరించిన లవర్ బాయ్ అబ్బాస్ మళ్లీ సిల్వర్ స్క్రీన్ పై సందడి చేయనున్నారు. సుమారు 11 ఏళ్ల బ్రేక్ తర్వాత ఆయన హ్యాపీ రాజ్ సినిమాతో రీఎంట్రీ ఇస్తుండటం సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మ్యూజిక్ డైరెక్టర్, నటుడు జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి రాజా దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు బ్యూటీ శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్ గా కనిపించనున్నారు. బియాండ్ పిక్చర్స్ బ్యానర్ పై సినిమాను జైవర్ధ నిర్మిస్తుండగా.. ఇప్పటికే షూటింగ్ పూర్తి అయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఆ చిత్రం మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు రాష్ట్రాల్లో ఆ సినిమాను మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ గ్రాండ్ గా విడుదల చేయనుంది. తాజాగా హైదరాబాద్ లో సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన తెలుగు ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ట్రైలర్ ను చూస్తుంటే.. కంప్లీట్ ఫ్యామిలీ అండ్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ గా సినిమా తెరకెక్కించినట్టు స్పష్టమవుతోంది. ఒక మిడిల్ క్లాస్ యువకుడు, పెద్దింటి అమ్మాయిని ప్రేమించడం వల్ల ఎదురయ్యే పరిస్థితులు, కుటుంబాల మధ్య జరిగిన సరదా సంఘటనలు కథలో మెయిన్ ఎలిమెంట్స్ గా తెలుస్తోంది. లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్, కామెడీనితో రూపొందించిన చిత్రంగా హ్యాపీరాజ్ కనిపిస్తోంది. సినిమాలో అబ్బాస్ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. హీరోయిన్ తండ్రిగా, అమెరికాలో నివసించే ఎన్నారై రాజీవ్ పాత్రలో ఆయన కనిపించబోతున్నారు. ట్రైలర్ లో ఆయన లుక్ చూసిన అభిమానులు, ఒకప్పుడు చెలి సినిమాలో కనిపించిన స్టైలిష్ అబ్బాస్‌ను గుర్తు చేసుకుంటున్నారు. దీంతో ఆయన రీ ఎంట్రీపై అంచనాలు మరింత పెరిగాయి. దర్శకుడు రాజా సినిమాను క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా రూపొందించారు. పెళ్లి వరకు వెళ్లాలనుకునే ఒక జంటకు, వారి కుటుంబాల మధ్య ఎదురయ్యే సంఘటనలను వినోదాత్మకంగా చూపించినట్లు తెలుస్తోంది. యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ ను ఆకట్టుకునే ఎలిమెంట్స్ చిత్రంలో ఉన్నాయని ట్రైలర్ సూచిస్తోంది. సంగీతాన్ని జస్టిన్ ప్రభాకరన్ అందించగా, జీవీ ప్రకాష్ కుమార్ తనదైన నటనతో ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ట్రైలర్ లో వినిపించిన సాంగ్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్లస్ అవ్వనున్నట్లు అర్థమవుతోంది. ఏదేమైనా హ్యాపీరాజ్ మూవీ లవ్, కామెడీ, ఫ్యామిలీ వాల్యూస్ తో రూపొందిన ఎంటర్టైనర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ముఖ్యంగా అబ్బాస్ రీ ఎంట్రీ, జీవీ ప్రకాష్ నటన, ఫ్యామిలీ ఎలిమెంట్స్ అన్నీ కలిసి ఆ సినిమాపై మంచి బజ్ ను తీసుకొచ్చాయి. మరి మార్చి 27వ తేదీన విడుదల కానున్న ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో వేచి చూడాలి.

## శ్రద్ధాకపూర్ జీవితంలో అత్యంత సాహసోపేతమైన పాత్ర!



కళ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టిన మహోన్నత జానపద కళాకారిణి విఠాబాయి భౌ వ్ మాంగ్ నారాయణగాంకర్ జీవిత కథ ఇప్పుడు 'విఠా' పేరుతో వెండి తెరపై ఆవిష్కృతం కాబోతోంది. మహారాష్ట్రకు చెందిన ఈ లెజెండరీ తమాషా (జానపద నృత్యం) కళాకారిణి జీవితం సామాన్యులకు సైతం స్ఫూర్తినిస్తుంది. సురభి నాటక కళాకారుల అంకితభావానికి ఏమాత్రం తీసిపోని విధంగా.. ఈ కళాకారిణి తన జీవితాంతం కళకే అంకితమయ్యారు. ఇప్పుడు ఆమె బయోపిక్ లో బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్ర పోషిస్తుండటం విశేషం. విఠాబాయి జీవితంలో జరిగిన ఒక సంఘటన వింటే ఎవరికైనా ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఒకసారి ఆమె స్టేజీపై ప్రదర్శన ఇస్తుండగా ప్రసవ వేదన మొదలైంది. ఏమాత్రం వెనకడుగు వేయకుండా.. వేదిక వెనుకకు వెళ్లి బిడ్డకు జన్మనిచ్చారు. అక్కడ సర్జికల్ పరికరాలు లేకపోవడంతో అందుబాటులో ఉన్న ఒక రాతితో బొడ్డు పేగును కోసి, బిడ్డను పక్కన పడుకోబెట్టారు. ఆ వెంటనే ఏమీ జరగనట్లుగా తిరిగి వేదికపైకి వచ్చి తన పెండింగ్ ప్రదర్శనను పూర్తి చేసి అందరినీ విస్మయానికి గురిచేశారు. విఠాభాయి జీవితంలో ఇంకా ఎన్నో సాహసఘట్టాలు ఉన్నాయి. భారత్- చైనా యుద్ధం జరుగుతున్న క్లిష్ట సమయంలో విఠాబాయి ప్రదర్శనలు దేశభక్తిని చాటాయి. యుద్ధ భూమిలో అలసిపోయిన భారత సైనికులకు తన జానపద ప్రదర్శనల ద్వారా వినోదాన్ని, మానసిక ఉల్లాసాన్ని పంచిన గొప్ప దేశభక్తురాలు ఆమె. సరిహద్దుల్లో సైనికుల నడుమ ఆమె చేసిన నృత్యాలు ఆనాటి కాలంలో ఎంతో ప్రాచుర్యం పొందాయి. కేవలం వినోదం కోసమే కాకుండా..సామాజిక చైతన్యం కోసం విఠాభాయి తన కళను ఆయుధంగా మలుచుకున్నారు. మహారాష్ట్రలో తమాషా కళకు విఠాబాయి ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు. తన విలక్షణమైన శైలితో.. అద్భుతమైన అభినయంతో దశాబ్దాల పాటు ప్రజలను అలరించారు. విఠా భాయి ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం అనేక పురస్కారాలతో గౌరవించింది. జానపద కళను బతికించడం కోసం ఆమె పడ్డ తపన, ఎదుర్కొన్న పేదరికం, సామాజిక వివక్షను నేటి బయోపిక్‌లో కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నారు. ఈ సినిమాలో శ్రద్ధా కపూర్ తన కెరీర్‌లోనే అత్యంత సవాలుతో కూడుకున్న పాత్రను పోషిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా మరాఠీ యాసతో పాటు సంప్రదాయ 'లావణి' నృత్య రీతుల్లో శిక్షణ పొందుతోంది. ఇంతటి సాహసోపేతమైన మహిళా కళాకారిణి కథను నేటి తరానికి పరిచయం చేయడం ఎంతో అవసరమని చిత్ర బృందం భావిస్తోంది. విఠాబాయి జీవితం కళాకారుల పై సమాజానికి ఉన్న దృక్పథాన్ని మారుస్తుందని.. ముఖ్యంగా ప్రసవ సమయంలో ఆమె చూపిన ధైర్యం మాతృత్వానికి, వృత్తిలో అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుంది. 'విఠా' చిత్రానికి ప్రముఖ మరాఠీ దర్శకుడు సంజయ్ జాదవ్ దర్శకత్వం వహిస్తున్నారు. లోక్ మన్యం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మరాఠీ- హిందీ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తున్నారు.

## మరో బయోపిక్‌లో ఛాంపియన్!



బాలీవుడ్ యంగ్ సెన్సేషన్ కార్తీక్ ఆర్యన్ బయోపిక్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాడా? అంటే సన్నివేశం చూస్తుంటే అలాగే కనిపిస్తోంది. ఇప్పటికే మురళీకాంత్ పేట్కర్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన చందు ఛాంపియన్ చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును కూడా కైవసం చేసుకున్నాడు. ఇప్పుడు అదే స్ఫూర్తితో మరో స్ఫూర్తిదాయక బయోపిక్‌లో నటించడానికి రెడీ అవుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే..కార్తీక్ ఆర్యన్ తన తదుపరి చిత్రంలో కాశ్మీర్ కి చెందిన యువ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ తాజ్ ముల్ ఇస్లాం జీవిత కథలో నటించబోతున్నాడు. ఆసక్తికర విషయం ఏంటంటే... చందు ఛాంపియన్ వంటి చిత్రాన్ని అందించిన దర్శకుడు కబీర్ ఖాన్ మళ్ళీ ఈ చిత్రానికి దర్శకత్వం వహించడం. వీరిద్దరి కాంబినేషన్ ఇప్పటికే ఒక నేషనల్ అవార్డును అందించడంతో తాజా ప్రాజెక్టుపై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒక సాధారణ యువతి అంతర్జాతీయ స్థాయిలో ఛాంపియన్‌గా ఎలా ఎదిగిందనే కథాంశంతో ఈ సినిమా రాబోతోంది. ఇందులో కార్తీక్ ఆర్యన్ కోచ్ పాత్రలో కనిపించనున్నాడు. సాధారణంగా చాక్లెట్ బాయ్ ఇమేజ్ ఉన్న హీరోలు బయోపిక్‌లు చేయడానికి వెనుకాడతారు. కానీ కార్తీక్ ఆర్యన్ మాత్రం శారీరక శ్రమతో కూడిన నటనకు ఎంతో ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుం టున్నాడు. చందు ఛాంపియన్ కోసం ఆయన చేసిన మేకోవర్ అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా తాజ్ ముల్ ఇస్లాం బయోపిక్ కోసం కూడా అదే స్థాయిలో కష్టపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా ఆయనను కేవలం ఒక కమర్షియల్ హీరోగానే కాకుండా,వర్సటైల్ యాక్టర్‌గా బాలీవుడ్ అగ్రస్థానంలో నిలబెట్టే అవకాశం ఉంది. ఒక నటుడు వరుసగా రెండు బయోపిక్‌లు చేయడం అందులోనూ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ఉండటం అనేది పెద్ద రిస్క్ తో కూడుకున్న పని. అయితే కబీర్ ఖాన్ మేకింగ్ స్టైల్, కార్తీక్ అంకితభావం చూస్తుంటే ఈ సినిమా మరో జాతీయ అవార్డు రేంజ్ లో ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాశ్మీర్ లోని సున్నితమైన పరిస్థితులు, అక్కడ ఒక క్రీడాకారిణి ఎదుర్కొన్న సవాళ్లు వంటి అంశాలు ఈ కథలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. హిట్ అయితే కార్తీక్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచిపోవడం ఖాయం. కార్తీక్ ఆర్యన్ కమిట్ మెంట్లు చూస్తుంటే? బాలీవుడ్ రియల్ లైఫ్ హీరో గా మారుతున్నాడా అనిపిస్తుంది.చందు ఛాంపియన్ అందించిన విజయంతో ఆయన బాధ్యత మరింత పెరిగింది. మరి ఈ తాజా బయోపిక్ ద్వారా ఆయన మరోసారి తన నటనతో ప్రేక్షకులను మెప్పించి అవార్డుల వేటను కొనసాగిస్తాడా? లేదా అన్నది చూడాలి. ఏది ఏమైనా? వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ కార్తీక్ సాగిస్తున్న ప్రయాణాన్ని యువ హీరోలకు మార్గదర్శకంగా చెప్పొచ్చు.

## టీటీడీ ఆలయాలను అధునాతన
# ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

### ఏపీ సీఎం చంద్రబాబు



తిరుమల, మార్చి 21 (పోలీస్ నిఘా) : తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పరిధిలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తితిదే బోర్డు సభ్యులకు సూచించారు. తిరుమలలో పర్యటించిన సీఎం.. శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముందస్తుగానే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమలలో ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భవిష్యత్తులోనూ కాలుష్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదాన ట్రస్టు సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం ట్రస్టు సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి, వారి సేవలను తితిదే పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తితిదేలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆల యాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు.



### తిరుమలలో హైటెక్ ఫుడ్‌సేఫ్టీ ల్యాబ్‌ను
## ప్రారంభించిన చంద్రబాబు

తిరుమల, మార్చి 21 (పోలీస్ నిఘా) : తిరుమలలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఫుడ్ అనాలిసిస్ ల్యాబ్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన 50కి పైగా పరికరాలను పరిశీలించారు. ల్యాబ్‌లోని పరికరాల పనితీరును అధికారులు సీఎంకు వివరించారు. నీరు, ఆహార పదార్థాలు, ముడిసరకుల నాణ్యతను ఈ ప్రయోగశాలలో పరీక్షించనున్నారు. 12 వేల చదరపు అడుగుల్లో రెండంతస్తుల్లో దీన్ని నిర్మించారు. ఆధునిక యంత్రాలతో ల్యాబ్‌ను తీర్చిదిద్దారు. తితిదే స్థలం కేటాయించగా.. కేంద్ర ప్రభుత్వ నిధులతో 9 నెలల్లోనే నిర్మాణం పూర్తి చేశారు.

### తిరుమల శ్రీవారి సేవలో
# చంద్రబాబు కుటుంబం








తిరుమల, మార్చి 21 (పోలీస్ నిఘా) : సీఎం చంద్రబాబు కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. మనవడు దేవాంశ్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారి సేవలో చంద్రబాబు కుటుంబం పాల్గొంది. ఆలయ మహాద్వారం వద్ద వారికి ఈవో, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు చంద్రబాబు కుటుంబం స్వయంగా వడ్డించింది. దేవాంశ్ పేరుతో ఒక్క రోజు అన్నదాన వితరణకు రూ.44 లక్షల విరాళం అందించారు. వెంగమాంబ సత్రం నుంచి పద్మావతి వసతిగృహానికి వెళ్తూ సీఎం మధ్యలో ఆగారు. లేపాక్షి కూడలిలో భక్తులతో మాట్లాడారు. ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు. భక్తుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం తిరుమలలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. తితిదే ఆలయాలను అత్యంత ఆధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. ముందస్తుగా గుర్తించి వెంటనే పరిష్కారం చూపే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచిం చారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి.. శ్రీవారి దర్శనం పూర్తి చేసి తిరుగు ప్రయాణం అయ్యే వరకు.. వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించా లన్నారు.

# 60% సీట్లపై అదనపు ఛార్జీలు రద్దు

### వ్యతిరేకించిన విమానయానసంస్థలు



న్యూఢిల్లీ, మార్చి 21 : అన్ని విమానాల్లో కనీసం 60 శాతం సీట్లపై ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకుండా విమానయాన సంస్థలకు కేంద్రం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. వీటిని దేశీయ విమానయాన సంస్థలు వ్యతిరేకించాయి. ఈ నిర్ణయంతో టికెట్ల ధరలను పెంచాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు ఇండిగో, ఎయిరిండియా, స్పైస్‌జెట్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ కేంద్ర పౌరవిమానయాన శాఖకు లేఖ రాసింది. ఈ ఆదేశాలు తమ కీలక ఆదాయ మార్గానికి గండి కొట్టే విధంగా ఉన్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చర్యల వల్ల విమానయాన సంస్థలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని పేర్కొంది. తాము కోల్పోయిన ఆదాయాన్ని తిరిగి రాబట్టుకోవడానికి విమానయాన సంస్థలు ఛార్జీలు పెంచాల్సి వస్తుందని తెలిపింది. ప్రయాణికుల ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయం చివరికి వారికే ప్రతికూలంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. తరచుగా విమానాల్లో ప్రయాణించేవారికి మరింత నష్టం కలిగిస్తుందని పేర్కొంది. ధరల నిర్ణయం, సీట్ల కేటాయింపు అనేవి కీలకమైన వ్యాపార నిర్ణయాలని ఎఫ్ఐఏ పేర్కొంది. విమానయాన సంస్థలకు చెందిన వాణిజ్య అంశాలలో డీజీసీఏ వంటి నియంత్రణ సంస్థలు ఎలా జోక్యం చేసుకుంటాయని ప్రశ్నించింది. అన్‌బండిల్డ్ (ఛార్జీలు మినహా ఇతర సేవలు) సేవల కోసం ఛార్జీలను నిర్ణయించే అధికారం డీజీసీఏకు లేదని తెలిపింది. ఈ ప్రకటన చేయడానికి ముందు విమానయాన సంస్థలను సంప్రదించారన్న వాదనలను ఖండించింది. ఈ ఆదేశాలను పునఃపరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

## ప్రజల హక్కులను లాక్కునే ప్రయత్నాలను
# అడ్డుకుంటాం: మమతా బెనర్జీ



కోల్‌కతా, మార్చి 21 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై తన పోరాటం కొనసాగిస్తానన్న ఆమె.. ప్రజల హక్కులు లాక్కోవడానికి ప్రధాని మోదీ చేసే ప్రయత్నాలను అడ్డుకుంటానన్నారు. రంజాన్ సందర్భంగా సెంట్రల్ కోల్‌కతాలో జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో భాజపా ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. 'సర్' పేరుతో రాష్ట్రంలోని అనేకమంది ప్రజల పేర్లను తొలగించారన్నారు. దీనిపై ప్రశ్నిస్తూ కులం, వర్గంతో సంబంధం లేకుండా బెంగాల్‌లోని ప్రజలందరికీ తాను తోడుగా నిలబడ్డానన్నారు. ఈ 'సర్'పై తన పోరాటాన్ని కొనసాగిస్తానని తెలిపారు. ప్రజల హక్కులను లాక్కోవడానికి ప్రధాని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటానని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వాన్ని నియంత్రించేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందని, రాష్ట్రపతి పాలన కూడా విధించాలని చూస్తుందని ఆరోపించారు. అయినా.. వీటన్నింటికీ తాము భయపడేది లేదన్నారు. ఈ సందర్భంగా భాజపాపై మమతా పలు విమర్శలు చేశారు. ఓట్లు చీల్చేందుకు కొందరు ద్రోహులు భాజపా నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు.

**ఆమె అందుకు అనర్హురాలు..**

ప్రధాని మోదీపై మమతా చేసిన ఆరోపణలను భాజపా తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగబద్ధమైన పదవికి ఆమె అనర్హురాలు అని పేర్కొంది. మోదీ మైనారిటీల వ్యతిరేకి అంటూ మమతా విమర్శలు చేయడంపై భాజపా నేత శిశిర్ బజోరియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయం సీఎంను వెంటాడుతుందని ఎద్దేవా చేశారు.

# సోషల్ మీడియాలో నిందితుల ఫొటోలు

### సుప్రీం ఆందోళన



న్యూఢిల్లీ, మార్చి 21 : మొబైల్ ఫోన్లలో చిత్రీకరించిన వీడియోలను ప్రజలు వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేసే ధోరణిని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. అలాంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. నిందితుల వీడియోలు, ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి, ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో ఒక వ్యాజ్యం దాఖలైంది. ఒక కేసు విషయంలో పోలీసుల మీడియా బ్రీఫింగ్‌పై మార్గదర్శకాలు రూపొందించాలని అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే రాష్ట్రాలను ఆదేశించింది. అందులో సోషల్ మీడియాను కూడా చేర్చాలని పిటిషన్ కోరారు. ఈ పిల్‌పై జరిగిన విచారణలో భాగంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంకెళ్లు వేసిన, తాళ్లతో బంధించిన, మోకాళ్లపై కూర్చోబెట్టిన నిందితుల ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాలో షేర్ చేయడం ఆ వ్యక్తి గౌరవానికి భంగం కలిగించడమే అవుతుందని, అది ప్రజల ఆలోచనను ప్రభావితం చేస్తుందని పేర్కొంది. "నిబంధనల ద్వారా పోలీసులను నియంత్రించడానికి వీలు ఉంటుంది. కానీ సోషల్ మీడియా, ప్రజల సంగతేంటి..? వారిని నియంత్రించగలమా..?" అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై విస్తృత పరిశీలన అవసరం అని అభిప్రాయపడింది.

## విమాన టికెట్ల ధరలపై కేంద్రం దృష్టి: రామ్మోహన్ నాయుడు



విశాఖపట్నం, మార్చి 21 (పోలీస్ నిఘా) : పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు విమానయానరంగంపై ప్రభావం చూపుతున్నాయని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. విమాన టికెట్ల ధరల పెరుగుదల విషయంలో ప్రయాణికులపై భారం పడకుండా ఉండేలా చర్చిస్తున్నామని తెలిపారు. శనివారం విశాఖపట్నంలో రామ్మోహన్ నాయుడు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సరిహద్దుల విషయంలో చర్చలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణం జరుగుతుందని.. జీఎమ్‌ను నియమించారని అన్నారు.

**దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై దృష్టి..**


కొత్తవలస - కిరండూల్(కేకే) రైల్వేలైన్ కోసం ఇంకా చర్చ జరుగుతోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. జగన్ హయాంలో రైల్వేజోన్ కార్యాలయ నిర్మాణానికి భూమి కేటాయించలేదని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టును జూన్ చివరి నాటికి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. విమానాశ్రయం ప్రారంభించే నాటికి రోడ్డు కనెక్టివిటీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సీఐఐ వార్షిక సమావేశంలో పాల్గొనటం ఆనందంగా ఉందని తెలిపారు. సీఐఐపై సీఎం చంద్రబాబుకు అపారమైన నమ్మకం ఉందని ఉద్ఘాటించారు. విజన్ 2047 అమల్లో సీఐఐ ముఖ్య భూమిక పోషిస్తుందని తెలిపారు.

# నతాంజ్ అణుకేంద్రంపై మళ్లీ దాడులు



ఇరాన్, మార్చి 21 : ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై మరోసారి దాడులు జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా-ఇజ్రాయెల్ దళాలు వైమానిక దాడులు చేశాయని తస్నిమ్ వార్తాసంస్థ తెలిపింది. అయితే, రేడియోధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల నివాసితులకు ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొంది. ఈ దాడులను ఇరాన్ అణు ఇంధన సంస్థ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్‌లు నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్‌ను లక్ష్యంగా చేసుకున్నారని మండిపడింది. ఈ దాడులు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం , ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. తాము జరిపిన దాడులతో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించిన వేళ తాజా దాడులు జరగడం గమనార్హం. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్‌పై ఓసారి దాడి జరిగింది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. శాటిలైట్ చిత్రాల ఆధారంగా.. అనేక భవనాలు దెబ్బతిన్నట్లు వెల్లడించింది. అయితే, రేడియేషన్ లీకేజీ ఉండకపోవచ్చని, అణు కేంద్రానికీ పెద్దగా నష్టం లేదని తెలిపింది. టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ అణుశుద్ధి కేంద్రాన్ని గతేడాది సైతం అమెరికా, ఇజ్రాయెల్‌లు లక్ష్యంగా చేసుకున్నాయి.

## ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తివేసిన అమెరికా



వాషింగ్టన్, మార్చి 21 : యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించడానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టంచేశారు.

## రైతులు సంఘటితమైతేనే వ్యాపారుల పెత్తనం తగ్గుతుంది: పెమ్మసాని

గుంటూరు, మార్చి 21 (పోలీస్ నిఘా) : వ్యవసాయం చేసే చాలా మంది రైతులకు సరైన ఆదాయం రావట్లేదని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఒకే పంట కాకుండా ఎక్కువ పంటలు వేయాలని సూచించారు. మార్కెట్ డిమాండ్‌పై అవగాహన పెంచుకున్నాక పంటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా కొర్నెపాడులో రైతు నేస్తం ఫౌండేషన్ పదో వార్షికోత్సవంలో కేంద్ర మంత్రి పెమ్మసాని పాల్గొన్నారు. మిద్దెతోటలు సాగుచేస్తున్న మహిళలకు అవార్డులు అందజేశారు. మిద్దె తోటల పెంపకం ప్రోత్సహిస్తున్న రఘోత్తమరెడ్డి, వెంకటేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. పురుగుమందులు లేకుండా వ్యవసాయం చేస్తున్న అందరికీ కృతజ్ఞతలు చెప్పారు. "వ్యవసాయంతో సరిపెట్టకుండా ఆహార ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. రైతు ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడితే లబ్ధి జరుగుతుంది. రైతులు సంఘటితమైతేనే వ్యాపారుల పెత్తనం తగ్గుతుంది" అని పెమ్మసాని తెలిపారు.

Printed, Published & Owned by Kemoju Madhuri, Plot No.32, 3rd Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code:500043, Printed at S.V.Printers, Plot No.32,Ground Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code: 500043, Editor : Kemoju Srinivas, RNI No.TELTEL/2016/68720, e-mail: policenigah@gmail.com. Cell: 9133613813, Off: 040-35668279